కథా నిలయం
4560
శ్రీకాకుళం

# మరో మజిలీ

సూటుకేసు పట్టుకొని స్టేషన్లో అడుగు పెట్టేసరికే రైలు కేకపెట్టి మెల్లగా కదల సాగింది. ఆ రైలు అందుకోక పోతే వచ్చే యిబ్బందులు లెక్కలేనన్ని. అందిన పెట్టెలో ఎక్కేశాను. కాస్సేపు తలుపు దగ్గరే నిలబడి కాస్త ఊపిరి తీసుకొని వెనక్కి తిరగ్గానే నా గుండె ఝల్లుమంది. నాలుగు బెర్తులున్న ఫస్టుక్లాసు కంపార్టుమెంటది. ఒక ప్రక్కగా కూర్చుని ఎటో చూస్తున్న యువతి ఉలికి పడింది.

నాకు మాట రాలేదు. ఆవిడను అలా ఎంతసేపు చూసినా తనివి తీరనట్లుంది.

"ఇక్కడికెలా వచ్చారు?" అని ఇంగ్లీషులో అడుగుతోంది.

"సారీ మేడమ్ .... సారీ ..."

"సారీ ఏమిటి ? రిజర్వు చేసిన కంపార్టుమెంటులో మీరెలా ఎక్కేరు?" మరీ రెట్టించి అడిగింది. తియ్యని స్వరంతో కటువైన మాటలు.

"మాట్లాడరేం"

"సారీ... సారీ ..."

"మరో మాట రాదా ఏమిటి?"

"సారీ మేడమ్. నేను వచ్చేసరికే బండి కదిలింది. వచ్చే స్టేషన్లో దిగిపోతాను". కర్చీపుతో మొహం తుడుచుకొన్నాను. ఆవిడ కాస్త అనుగ్రహించేలా ఉంది. ఒక్కసారి నా మొహంకేసి

చూసి. "అలా కూర్చోండి" అని ఎదుటి సీటు చూపించింది. కంపార్టుమెంటంతా రకరకాల సామానుతో నిండిపోయింది. అవన్నీ నాజూకుగా అమర్చి ఉన్నాయి. ఆవిడ మ్యాగజైను చదవటంలో నిమగ్నమయింది. ఆమెను తనివితీరా చూడటానికి నాకు మంచి అవకాశం దొరికింది. ఇంత అందగత్తెను నేనింతవరకు చూడలేదు. మా కాలేజీలో అందమైన అమ్మాయిలు లేకపోలేదు. కాని ఈవిడ అందం వేరు. ప్రబంధాల వర్ణనలోలా ఈమె చేతులు తామర తూడులు, కళ్ళు మీనాలు, కురులు తుమ్మెద రెక్కలు అని చెప్పినా, గజల్సులో వలె 'గుల్‌బదన్' అని అన్నా నాకు తృప్తి కలగబోదు. అరవిచ్చిన గులాబీని ఈమె మొహం దగ్గర పెడితే, ఈ మొహమే అందంగా ఉంటుందేమో ననిపించింది.

ఇంతలో టాయిలెట్ తలుపు తెరుచుకొని, నడివయస్సులో ఉన్న ఒకావిడ టవలుతో మొహం తుడుచుకొంటూ వచ్చింది. నాకేసి ప్రశ్నార్థకంగా చూస్తూ నిలుచుంది.

అందమైన యువతి తలెత్తి చూసి, అదేదో భాషలో ఈమెతో చెప్పింది. ఈ రెండో వ్యక్తి నన్ను చూస్తూనే వెళ్ళి నేను కూర్చున్న బెర్తుమీద ఆ చివరగా కూర్చుంది.

మళ్ళీ సౌందర్యారాధనలో మునిగిపోయాను. ఆమె అప్పుడే తలెత్తి చూసింది. ఆ కళ్ళలోని కాంతికి నా కళ్ళు జిగేలుమన్నాయి. చూపు తిప్పుకున్నాను. మళ్ళీ దొంగచాటుగా ఆవిడను చూశాను. ఆవిడ ఇంకా చూస్తూనే ఉంది. ఈసారి కంగారుపడ్డాను. నేనెవ్వరో దుర్మార్గుణ్ణని ఏ గొలుసో లాగి నన్ను పోలీసుల కప్పజెపితే నా గతేం కాను?

"మీరు తెలుగువారా?" ఆమె ఆంగ్లంలో అడిగింది.

"అవునండి".

"ఎక్కడికి వెళ్తున్నారు?" స్వచ్ఛమయిన తెలుగు.

నాకు ఆశ్చర్యంతో నోట మాట రాలేదు.

"నేనూ ఒక విధంగా తెలుగుదాన్నేలెండి. మీరు ఎంతవరకు? హౌరా వెళ్తున్నారా?"

తల ఊపాను.

"మీ పేరు?"

"రాజశేఖరం".

"నా పేరు ఫానీ ఆషా. ఈవిడ సంధ్య. బెంగాలీ. నాతోనే ఉంటుంది".

ఈ మహారాణికి చెలికత్తె కాబోలు.

"ఫానీ ఆషా అంటే......."

"అవును నేను క్రిష్టియనును. మీరు సద్బ్రాహ్మణులా? మడి ఆచారం బాగా పాటిస్తారా?" సెలయేటి గలగలతో నవ్వింది. కాదని తల అడ్డంగా ఊపాను.

"కలకత్తాకు ఏదైనా పని మీద వెళ్తున్నారా?"

నా వ్యవహారాలు ఈమెకెందుకు అనుకొన్నాను. కాని అబద్ధం చెప్పలేక పోయాను.

"పనికోసం వెళ్తున్నానండీ."

"ఏదైనా ఉద్యోగం వచ్చిందేమిటి?"

"లేదు. వెతుక్కోవాలి."

"అంతదూరం వెళ్తేగాని మీ చదువుకు తగిన ఉద్యోగం దొరకదా?".

ఆ కళ్ళలో ఆ నవ్వేమిటి? ఎంత గర్వం అనుకొన్నాను.

"నేనేమీ అక్షరమ్ముక్క రానివాడిని కాను. బి.ఏ. లిటరేచరు. క్లాసు తెచ్చుకున్నాను. ఏ కాలేజిలోనో ట్యూటరు ఉద్యోగం దొరక్కపోదు"

"చాలా ఆత్మవిశ్వాసం ఉందే. ఇంతకు ముందెప్పుడయినా కలకత్తా వెళ్ళారా?"

"మరీ అంత పల్లెటూరి మొద్దులా కనిపిస్తున్నానా?"

సుతారంగా నవ్వింది.

"చూడగా ఇంట్లో అలిగి వచ్చిన బాపతులా ఉంది."

నేను గతుక్కుమన్నాను.

"అంత పెద్ద పట్టణంలో ఏ ఉద్యోగం దొరుకుతుందని ముందూ వెనకా చూసుకోకుండా బయలుదేరారు? మీకంటే ఎక్కువ చదువుకొన్న వాళ్ళెందరో ఉద్యోగాల్లేక తిరుగుతున్నారే. వెళ్ళగానే మీకెవరిస్తారు ఉద్యోగం?"

బుద్ధిలేక ఈవిడకు నా విషయం చెప్పాను. నీతి చంద్రిక బోధించేలా ఉంది.

"శేఖర్‌గారూ. నా మాటవిని మీ ఇంటికి వెళ్ళండి. కావాలంటే రెండు రోజులు కలకత్తాలో ఆగి అన్నీ చూసి వెళ్ళండి. ఇంత త్వరపడి నిర్ణయాలు తీసుకోడమంత తప్పు మరేదీ లేదు."

"మీ కెందుకంత బాధ? నేనేం మీ సహాయం కోరలేదుగా."

"ఏదో తోచిన సలహా ఇచ్చాను. మరేమీ అనుకోకండి."

"కృతజ్ఞుణ్ణి. ఈ జీవితాన్ని ఇరవైమూడేళ్ళగా చూస్తున్నాను. మరీ పసివాణ్ణికాదు."

ఆమె బలవంతాన నవ్వాపుకొంది. ఛీ ... ఛీ .... తన కంపార్టుమెంటుకు వచ్చానని ఎంత లోకువ. ఇంకో స్టేషన్లో నా థర్డు క్లాసు వెతుక్కోవాలి.

ఆమె చెలికత్తె, అదే సంధ్య కాబోలు, నాకేసి కాస్సేపు చిత్రంగా చూసి తర్వాత మౌనంగా కిటికీలో నుంచి చూస్తూ కూర్చుంది.

నేను ఎవరితోనూ మాటలు పెంచటం క్షేమం కాదని నా ఆలోచనల్లో నేను ఉండిపోయాను. ఎప్పుడో నిద్ర పట్టేసింది. మెలుకువ వచ్చేసరికి బాగా మధ్యాహ్నమయింది. నేనెక్కడున్నానో బోధపడలేదు. కాస్సేపు తర్వాత ఆమె, ఆషా గుర్తుకు వచ్చింది. ఆమెతో ఏదో దురుసుగా మాట్లాడాను. అరె! నా తలక్రింద తలగడ ఎక్కడిది?

"హలో, నిద్ర లేచారా?"

అటు చూశాను. ఆషా నవ్వుతూ నిల్చుని ఉంది. తడితడిగా ఉన్న మొహం మంచులో తడిచిన పువ్వులా ఉంది. తన ఉంగరాల బాబ్డ్‌హెయిర్ సుతారంగా చెంపల్ని తాకుతోంది.

"కోపం తగ్గలేదా?" ఎదుటి సీట్లో కూర్చుంటూ అడిగింది.

"నాకెందుకు కోపం?" సౌమ్యంగానే అడిగాను.

"మొహం కడుక్కురండి. ఆకలిగా లేదూ."

"నేను ఇంకో కంపార్టుమెంటుకు వెళ్ళాలి." లేచి కూర్చున్నాను.

"ఇది స్టేషను కాదుగా. స్టేషను వచ్చేవరకు అలాగే కూర్చుంటారా?"

లేచి వెళ్ళి మొహం కడుక్కొచ్చాను.

సంధ్య ఈ లోపుగా రొట్టెలు, స్వీట్సు ఇంకా ఎన్నో తినుబండారాలు ప్లేట్లలో సర్ది ఉంచింది. ఆకలికేం కొరత లేదు. మాట్లాడకుండా తిన్నాను.

"చాలా థాంక్సండీ. అదే ఇంకెవరో అయితే నేనెన్ని ఇబ్బందులు పడవలసి వచ్చేదో".

"మీరు ఇబ్బందులు కోరి తెచ్చుకొంటారు. ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? కంపార్టుమెంటంతా రిజర్వు చేసుకొన్నాను కదా! మీరు ఒక బెర్తు మీద పడుకొంటే మాత్రం నష్టమేముంది? ఇంకో కంపార్టుమెంటుకు వెళ్తాననడంలో ఏమైనా అర్థముందా?"

నేను అవాక్కయి కూర్చున్నాను. ఆవిడ పలువరస తళుక్కుమనేలా నవ్వింది.

కలకత్తా చేరేలోపుగా మేము ఆత్మీయులమై పోయాము.

ఏవేవో కబుర్లు చెప్పుకొన్నాము. అయితే వ్యక్తిగత విషయాలను మాత్రం ఇద్దరం కదపలేదు. రైలాగగానే పోర్టరు సామాను దింపాడు. టాక్సీలో ఆమె సామానుతోపాటు నాదీ పెట్టించబోతున్నప్పుడు నేను ఆమెను వారించాను.

"నేను హోటల్లో దిగుతాను."

నాకేసి చూసి నవ్వింది.

"మా ఇల్లూ పెద్దదే, మీకన్ని సౌకర్యాలూ జరుగుతాయి."

"థాంక్యూ. బట్ లెట్ మి హావ్ మై ఓన్ వే."

నా మొహంలో ఏ భావం చూసిందోగాని చప్పున తన పర్సు తెరిచి అడ్రసు కాగితం ఒకటి ఇచ్చింది.

"మీకే అవసరమొచ్చినా నన్ను కలుసుకోండి."

ఆమె టాక్సీలో కూర్చోగానే టాక్సీ కదిలింది. ఆమె చిరునవ్వుతో చెయ్యి ఊపింది.

★ ★ ★

ప్రస్తుతానికి ఒక హోటలులో మకాం. రోజూ వాంటెడ్ కాలమ్స్ చూడటమే నా ముఖ్య కార్యక్రమం. దరఖాస్తులయితే పెట్టున్నాను కాని వాటి ఫలితం తెలిసేవరకు జేబులో డబ్బు నిలిచేలా లేదు. పదిహేను రోజులు గడిచాయి. రెండు మూడు రోజులుగా ఒంటిపూటే తింటున్నా జేబులు ఖాళీ అయాయి. వాచీ, ఉంగరం మిగిలాయి. వాటిని అమ్మటానికి వెళ్తే షాపువాడు చాలా అనుమానంగా చూశాడు. నావేనని నమ్మించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది. నూట యాభై రూపాయలు చేతిలో పెట్టాడు. అసలు వాచీయే చేస్తుంది అంత ఖరీదు. కాని అవసరం మరి. ఈ డబ్బుమాత్రం ఎన్నాళ్ళు ఆగుతుంది? కష్టాలన్నీ నా మొహాన్నే ఎందుకు వ్రాశాడో ఆ దేవుడు.

మరికొన్నాళ్ళు గడిచాయి. నా కార్యక్రమంలో మార్పు లేదు. నాకు ఉద్యోగం లేదు. ఆ సాయంకాలం అలా నడుచుకొంటూ ఒక పార్కు చేరుకొన్నాను. చుట్టూ మనుషులు. పిల్లల కేరింతలు. ప్రపంచంలో మరెవ్వరికీ కష్టాలు లేవేమో ననిపించింది. సందడికి దూరంగా ఒక

బెంచీమీద కూర్చున్నాను. ఆషా గుర్తొచ్చింది. ఆవిడ దగ్గరకు వెళ్తే ఏదైనా సహాయం చేస్తుందేమో. చాలా ధనవంతురాలిలా ఉంది. వాళ్ళ నాన్నగారో, భర్తో బాగా పలుకుబడి కలిగిన వాళ్ళయి ఉండాలి. ఇంతకూ తనకు పెళ్ళయిందా ? ఆమె భర్త ఎవరయినా కాని అతను చాలా అదృష్టవంతుడు. ఆ పాలరాతి శిల్పం సజీవంగా ఇంట్లో తిరుగుతూ ఉంటే ... ఆ మెత్తని పాదాల క్రింద కాశ్మీరు తివాసీలు ...

ఎవరో పిలిచినట్లుయింది ... నా ఆలోచనలు చెదరి పోయాయి. బెంచీమీద నాకు దగ్గరగా కూర్చున్నాడొక ముసలాయన. ఎప్పుడొచ్చాడో, ఏదో బెంగాలీలో అడుగుతున్నాడు. నా అందమైన ఆలోచనలు చెదరిపోయాయని కోపం. ప్రస్తుతం నా నిస్సహాయతతో కలిసిన విసుగు.

"నాకు బెంగాలీ రాదు" కొంచెం కటు స్వరంతోనే సమాధానం చెప్పాను ఇంగ్లీషులో.

ఆయన కళ్ళజోడులో నుంచి మృదువుగా నవ్వాడు. "నీవు చదువుకొన్న వాడిలా ఉన్నావు. క్రొత్త వాళ్ళతో అంత కఠినంగా మాట్లాడటం సభ్యతేనా?" అని ఇంగ్లీషులో అడిగాడు.

నా మానాన నన్ను ఉండనివ్వక ఈయన నాకు సభ్యత నేర్పించటమేమిటి? "అందరికీ మీ అంతటి సభ్యత ఉంటుందా?" అన్నాను చాలా వ్యంగ్యంగా.

అతనికి కోపం రాలేదు. మహా పురుషునిలా పెదవులపై నవ్వు నిలుపుకున్నాడు.

"చాలా విసుగ్గా ఉన్నావు. మూడ్‌బాగా లేదా?"

"జీవితమే బాగలేదు. మూడ్‌కేమొచ్చె? నా ఏడుపు నన్నేడవనివ్వండి."

నిజంగానే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆయన నా దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. కొత్త వ్యక్తి దగ్గర బయటపడి పోయానే అని కించపడ్డాను. అక్కడ ఉంటే నా బాధ మరింత ఎక్కువయ్యేలా ఉంది. లేచి వెళ్ళబోయాను. ఆయన నా చెయ్యి పట్టుకు ఆపాడు.

"ఇలా కూర్చోబాబూ. ఇంత చిన్న వయసుకే అంత దుఃఖం నీకెందుకు కలిగింది? తిండీ, బట్టలేక ఎందరో అలమటిస్తూ ఉండగా మనం తీరి కూర్చుని కష్టాలు కల్పించుకోవచ్చా?"

"తీరి కూర్చుని కష్టాలు ఎవరు తెచ్చుకొంటారండీ? మాటలకేం ఎన్నయినా చెప్పవచ్చు. అనుభవించే వాడికే గాని కష్టాలు తెలిసిరావు."

"నీ కష్టాలేమిటో తెలియజెప్పు బాబూ. కనీసం ఈ ముసలి బుర్రతో ఊహించటానికైనా ప్రయత్నిస్తాను."

అతి ప్రశాంతంగా మాట్లాడే ఆయనను చూసి నేను సిగ్గుపడ్డాను.

"క్షమించండి. ఏం వాగుతున్నానో నాకే తెలియటం లేదు."

"పర్వాలేదులే. నీ ఇబ్బందులేవో చెబితే నా చేతనయిన సహాయం చేస్తాను."

ఉద్యోగం కోసం నేను పడిన పాట్లన్నీ చెప్పాను.

"మీ ఆంధ్రప్రదేశ్ వదిలి ఉద్యోగం వెతుక్కొంటూ ఇంత దూరం ఎందుకు వచ్చినట్లు?"

"ఇంట్లో పరిస్థితులు బాగలేవు."

"ఏం చదివావు?"

చెప్పాను.

"ఉద్యోగం చాలా అవసరమా?"

"అవసరం లేకపోతే ఈ ఊరుకాని ఊళ్ళో కష్టాలు పడటం నాకు హాబీ అనుకొన్నారా?"

అతను ఫెళ్ళున నవ్వాడు.

"జర్నలిజంలో ఆసక్తి ఉందా?"

"అనుభవంలేదు. ఎవరైనా గైడెన్సు ఇస్తే చెయ్యగలననుకొంటాను."

"మా దినపత్రికలో కొన్నాళ్ళు పనిచేసి చూడు. నచ్చితే అక్కడే ఉండొచ్చు. లేదా నీకు నచ్చిన వేరే ఉద్యోగం వస్తే వెళ్ళిపోవచ్చు."

నేను సంభ్రమాశ్చర్యాలతో వణికిపోయాను. నేనింత దురుసుగా మాట్లాడింది ఇంత సహృదయునితోనా? సిగ్గుతో నా తల వాలిపోయింది.

"సమ్మతమేనా?"

అవునని తల ఊపాను.

నా పేరు అడిగారు.

చెప్పాను.

"రేపు ఈ అడ్రసుకు వచ్చి కలుసుకో" అని అడ్రసు కార్డు ఇచ్చారు. వారు బినయ్ ముఖర్జీ.

"మీ యువ హృదయాలు ఉత్సాహంతో ఉప్పొంగుతుంటాయి. దానిని చల్లార నివ్వకూడదు. మీ శక్తిని సద్వినియోగం చేసుకొంటే ఎన్ని పనులయినా సాధించవచ్చు. యువకులంటే నాకు ఎంతో అభిమానం."

ఆయన నెరిసిన తలకేసి చూశాను. ఈ క్రొత్త ఊళ్ళో నాకింత ఆదరణ లభించటం నా అదృష్టం అనుకోవాలా లేక ఆయన మంచితనం అనుకోవాలా? కృతజ్ఞతతో ఆయనకు చేతులు జోడించి సెలవు తీసుకొన్నాను.

★ ★ ★

బినయ్ ముఖర్జీ నాకోసం అన్ని వసతులతో ఉన్న ఓ గదిని అద్దెకు ఇప్పించారు. భోజనం అదీ హోటల్లోనే చేస్తున్నాను.

నేను పని ప్రారంభించి నెల రోజులయింది. అప్పటినుండి కూడా ఆషాను చూడాలని తాపత్రయ పడుతున్నాను. కాని ఆమె ఇచ్చిన అడ్రసు కాగితం ఎక్కడో పోయింది. సినిమాహాలులో, హోటళ్ళలో, పార్కుల్లో ఎక్కడో ఒకచోట ఆవిడ దర్శనం లభించక పోతుందా అని కళ్ళింతింత చేసుకు చూసేవాడిని. కాని ఫలితం దక్కలేదు.

బినయ్ ముఖర్జీ పసివాడిచేత 'అ, ఆ' లు దిద్దించినంత శ్రద్ధగా నాకు పనిని నేర్పారు. ఇంగ్లీషు భాష రాగానే సరిపోదంటూ, వార్తలు వ్రాసే పద్ధతి, న్యూస్ ఐటెమ్‌కు, ఫీచర్ ఆర్టికల్‌కు, మామూలు ఆర్టికల్‌కు గల తేడా, వాళ్ళ పత్రికా విధానం ... ఇవన్నీ వివరించారు. నేను మొదటిసారిగా వ్రాసిన న్యూస్ ఐటెమ్ నాకు బాగా గుర్తుంది. మధ్యప్రదేశ్ నుండి ఒక కరస్పాండెంటు పంపాడు. దానిని బాక్స్ ఐటెమ్‌గా ఇవ్వాలని ఆయన చెప్పారు. ఆసక్తిదాయకంగాను, ప్రముఖంగాను ఉన్న కొన్ని వార్తలను బాక్స్ ఐటెమ్స్‌గా ఇస్తారని, వాటి భాష తేలిగ్గాను, ఆసక్తి కలిగించేటట్లుగానూ ఉండాలని ముఖర్జీ చెప్పి పాత పేపర్లలో నుండి కొన్ని ఉదాహరణలు కూడా చూపించారు.

ఆ విలేకరి పంపిన రిపోర్టులో నాకేమీ అవకతవకలు కనిపించలేదు. కొన్ని పదాలు మాత్రం మార్చి, వాక్యాలు మరింత స్పష్టంగా ఉండేలా తిరుగ వ్రాశాను. నేను వ్రాసింది రెండుసార్లు చదువుకొని, తృప్తిగా ముఖర్జీ బల్లమీద పెట్టాను. ఆయన మొదటి వాక్యం చదవగానే పెద్దగా నవ్వేశారు.

నాకు చాలా చిన్నతనమనిపించింది. తెల్లబోయి వారికేసి చూశాను.

"శేఖర్. ఈపాటికి ఎన్నో న్యూస్ పేపర్లు చదివి ఉంటావు. ఎక్కడయినా ఇటువంటి ఐటెమ్ చదివావా? అనగా అనగా ఒక రాజు అని మొదలు పెట్టటానికి ఇదేం చిన్నపిల్లల కథా?"

నేను వ్రాసిన ఐటెమ్ ఆయన తిరిగి మరో విధంగా వ్రాసి చూపించారు. వార్తలో ప్రధానమైన అంశమే మొదట వస్తుందని మిగిలిన అంశాలు వాటి వాటి ప్రాధాన్యాన్నిబట్టి ఒకదాని తర్వాత మరొకటి వస్తాయని చెప్పారు.

ఇంటర్నల్ ఫోనులో తన సెక్రటరీని పిలిచారు. ఇరవై, ఇరవై రెండేండ్ల అమ్మాయి గదిలోకి వచ్చింది.

"నీలిమా, శేఖర్ మన ఆఫీసులో క్రొత్తగా చేరాడు. రోజూ ఒక అరగంట ఇతనికి టైపు నేర్పించే బాధ్యత నీది!"

తను నవ్వింది. "విత్ ప్లెజర్" అంది.

"అలాగే బెంగాలీ కూడా నేర్పిస్తూ ఉండు".

"ఒకేసారి ఇన్ని విద్యలు నేర్చుకోమంటే ఆయన పారిపోతారేమో" అంది నీలిమ.

'పారిపోవటం' అని వినగానే ఉలికిపడ్డాను నేను.

ఆరోజు నుండి టైపింగు కూడ మొదలయింది. నీలిమ చకచక టైపు చేస్తుంటే నాకూ అలాగే చేయాలనిపించేది కాని ఒక రోజుకు ఐదు అక్షరాల 'కీ'లు మాత్రమే నొక్కాలనేది నీలిమ. నాకు కాసేపు సరదాగా ఉన్నా ఆతర్వాత విసుగొచ్చేది. కాని నీలిమ పట్టిందే పట్టు. అందుకే నెల రోజుల్లో టైపింగు వచ్చేసింది. 'ఇక స్పీడు పెంచుకోటం మీకు వదిలేస్తున్నాను' అంటూ నవ్వింది నీలిమ.

★ ★ ★

రెండు నెలలు గడచిపోయాయి. పత్రికలో నా ఐటెమ్స్ అట్టే మార్పులు లేకుండా వెలువడుతున్నాయి. ప్రింటులో నేను వ్రాసినవి చూసుకొంటుంటే నాకు భలే ఆనందం కలిగేది. కాని ఆ ఆనందం ఎవరితో పంచుకోవాలి?

సాయంకాలాలు మరీ ఒంటరిగా గడుస్తున్నాయి. దగ్గరలో ఒక లైబ్రరీలో సభ్యుణ్ణి అయ్యాను. సాహిత్యానికి, జర్నలిజానికి సంబంధించిన పుస్తకాలు చదువుతున్నాను. మొదట

జర్నలిజం డిప్లొమాచేసి ఆ తర్వాత యం.ఏ. చేయాలని నిర్ణయించుకొన్నాను. ఇక్కడే కలకత్తా యూనివర్సిటీ నుండి డిప్లొమా చేయాలనుకొన్నాను. కొన్నాళ్ళు ఉద్యోగంలో డబ్బు వెనకేసిన తర్వాత కదా ఏ చదువైనా. నా ఆలోచనల మధ్య ఆషా ఎప్పుడూ తళుక్కుమని మెరిసేది. ఎప్పుడో రైలు ప్రయాణంలో కలుసుకొన్నంత మాత్రాన ఆమెను గురించి అంతగా ఆలోచించవలసిన అవసరమేదీ నాకు కనిపించలేదు. కాని బుద్ధిని హృదయం ఓడిస్తూనే ఉంది. కనిపించిన ప్రతి అందమైన యువతినీ ఆషా అందంతో పోలుస్తూ ఉంటాను. కాని ఆషా అంత అందగత్తెను మరెక్కడా చూడలేకపోయాను.

ఒకరోజు తలనొప్పిగా ఉందని సెలవు చీటి పంపాను. విశ్రాంతి తీసుకొంటే ఆ నొప్పి తగ్గుతుందనుకొన్నాను. కాని సాయంత్రానికి జ్వరం వచ్చేసింది. మరుసటి రోజు మరీ ఎక్కువయింది. ముఖర్జీ స్వయంగా డాక్టరును తీసుకొచ్చారు. రోజంతా నా దగ్గర ఉండటానికి నౌకరును కూడ ఏర్పాటు చేశారు. ఆ జ్వరం వారం రోజులు వదలలేదు. ఆ తర్వాత తగ్గుముఖం పట్టింది. మరికొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోమన్నారు ముఖర్జీ.

★ ★ ★

ఆ ఉదయం నిద్రకళ్లు తెరువగానే బల్లమీద గాజుగ్లాసులోని పూలు నన్ను పలుకరించాయి. గదిలో వేజ్‌లు పెట్టాలని కాని, వాటిలో పువ్వులుంచాలనిగాని నేనెన్నడూ అనుకోలేదు. ఇంత శ్రద్ధగా, అందంగా నౌకరు పూలు అమరుస్తాడని నేను నమ్మలేక పోయాను.

ఇంతలో తలుపు తీసిన చప్పుడయింది. గుమ్మంలో ఏమిటా మెరుపు? నా గుండె గొంతుకలో కొట్టుకులాడింది. మాట పెగలలేదు. "ఆషా.. ఆషా" అని మాత్రం నా పెదవులు ఉచ్చరించాయి. "అవును శేఖర్. నేనే. గుర్తున్నానేమిటి?" అంది నవ్వుతూ. ఎండ వెలుగును భరించలేనట్లే ఆమె వెలుగును భరించలేక పోయాను.

"ఎలా వచ్చారు" అన్నాను కళ్లు మూసుకొంటూ.

"టాక్సీలో" నవ్వింది తను.

నేనూ నవ్వాను. "ఆ విషయం నాకూ తెలుసు. ఈ బీదవాడి ఉనికి మీకెలా తెలిసిందా అని."

"మీ ఉనికి తెలుసుకోటం కష్టమా ఏమిటి? 'ఇన్-దిస్ వీక్' అని ఆ పేపర్లో రెండు వారాలుగా మీ ఐటెమ్ వస్తూనే ఉందిగా."

"ఆ శేఖర్ నేనే అని ఎలా అనుకొన్నారు?"

"నాకు దివ్యదృష్టి ఉందిలే."

నేనేం మాట్లాడలేదు.

"మా ఇంటికి రాలేదేం? మీ హోదాకు భంగమా?

"అంతంత మాట లెందుకు ఆషా. పూటకు ఠికాణా లేనివాడికి హోదా ఏమిటి?"

"అరెరె. ఇంతలో కోపం వచ్చిందా. మా ఇంటికి ఎందుకు రాలేదు. నన్ను చూడకూడదనుకొన్నారా?"

"చూడాలని ఉండీ రాలేకపోయాను. అడ్రసు కాగితం పోయింది."

"టెలిఫోను డైరక్టరీ చూడలేకపోయారా?"

"తోచలేదు. అయినా ఫోను మీ పేరుతో ఉందని కలగన్నానా?"

"నా పేరుతోగాక ఇంకెవరి పేరుతో ఉంటుందనుకొన్నారు?"

నేనేమీ మాట్లాడలేదు. ఇంతలో నౌకరు బ్రెడ్డు, వెన్న తెచ్చాడు. ఆషా టేబిల్ దగ్గరకు వెళ్ళింది. నేను మొహం కడుక్కోటానికి లేచాను.

ఆ తర్వాత రెండు రోజులకు ఆషా స్వయంగా నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళింది. ఆవిడ నిజంగా లక్షాధికారిణిలా కనిపించింది. పెద్ద ఇల్లు, తోట, నౌకర్లు అన్ని హంగులూ ఉన్నాయి. ఇల్లంతా చూపించింది. అన్ని గదులు తనలాగే పొందికగా అమర్చిఉన్నాయి.

'చిఇంత ఇంట్లో, ఒంటరిగా మీ కెలా గడుస్తుంది" అన్నాను. తను నవ్వింది. "కాలక్షేపానికేం తక్కువ? రోజంతా కాలేజిలో గడచిపోతుంది. సాయంకాలాలు స్నేహితులు, పుస్తకాలు. ఇంతకంటే ఇంకేం కావాలి" అంటూ లైబ్రరీకి దారి తీసింది.

ఒక వ్యక్తి అన్ని పుస్తకాలను చేర్చటమన్నది మామూలు విషయమేమీ కాదు.

"ఈ పుస్తకాలన్నీ చదివేశారా?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"చాలావరకూ. అయినా మీకో విషయం చెప్పలేదల్లే ఉంది. మేడపైని రెండుగదులూ, హాలు కళా సమాజానికి ఇచ్చివేశాను. సమాజ్ పుస్తకాలు కూడా అవతలి రెండు బీరువాల్లో ఉన్నాయి. ఈ సమాజంలోని సభ్యులందరూ ఈ లైబ్రరీ సభ్యులే".

"ఈ సమాజం ఏం చేస్తుంది?"

"చేసేదేముంది. రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులు మెంబర్లు. నెలనెలా

మీటింగులు జరుగుతుంటాయి. కవి సమ్మేళనాలు, పాట కచ్చేరీలు, నాటకాలూ ఏర్పాటు చేస్తుంటాము. ఎప్పుడయినా ప్రముఖులను ఆహ్వానిస్తాము."

"మీరే ఈ సమాజాన్ని స్థాపించారా?"

"నా ఒక్కదానివల్ల ఏమవుతుంది శేఖర్. మీ వంటి రచయితలూ, సహృదయులూ లేకపోతే."

"నన్ను రచయితను చేశారేమిటండోయ్ ... ఇంతకూ అడగటం మరచిపోయాను. 'పగలంతా కాలేజి' అన్నారు. ఏ కాలేజీలో పని చేస్తున్నారు?"

"ఏదో కాలక్షేపానికి చిన్న కాలేజీలో పనిచేస్తున్నాను. ఈ సంవత్సరమే మొదటిసారిగా మా విద్యార్థినులు బి.ఏ. పరీక్షకు కూర్చుంటున్నారు."

"స్త్రీల కళాశాలన్నమాట. మీరు ఏ డిపార్టుమెంటులో పనిచేస్తున్నారు?" ఆమె కళ్లు కొంటెగా మెరిశాయి.

"మీకే కాదు. ఆంగ్ల సాహిత్యంలో నాకూ కొద్దిగా ప్రవేశముంది. అదే పిల్లలకు బోధ పరుస్తున్నా"

ఒక క్షణం నా మనసు మూలిగింది. తను యం.ఏ. అన్నమాట.

"ఏ యూనివర్సిటీలో చదివారు"

"బెంగుళూరు. క్లాసు వివరాలు కావాలా?"

"చెప్పకూడదా?"

"ప్రథమ శ్రేణి. గోల్డు మెడల్ కూడా వచ్చింది."

"యూనివర్సిటీ ఫస్ట్! మైలార్డ్. అందుకే నా చదువు గురించి మీరు అంతగా నవ్వుకొన్నారు ఆ రోజు."

"ఏ రోజు?"

"అదే ట్రైనులో."

మెరుపులా నవ్వింది. "అందుకని కాదు శేఖర్. మీ అమాయకత్వం చూసి నవ్వు వచ్చింది."

ఆమె గదిలో తంబూరా కనిపించింది. "మీకు సంగీతం కూడా వచ్చన్నమాట."

"ఏదో ఓ మోస్తరు. రవీంద్ర సంగీతం మొదలుపెట్టి మూడు నాలుగేళ్ళయింది."

"అమ్మో, మీరు సామాన్యులు కాదు ... సర్వవిద్యా పారంగతుల్లా ఉన్నారు. ఇన్ని వ్యాపకాలలో మీకు తీరికెలా ఉంటుంది అని అడగాలనిపిస్తోంది."

"భలే వాడివే" గలగల నవ్వింది. "నీవు కూడా మా కళాసమాజంలో మెంబరు కాకూడదూ .... ఏమిటి ... ఓ ... ఐయామ్ సారీ ... ఎంతయినా నా కంటే చిన్నవాడివి. ఏకవచనంతో పిలిచే చనువు నాకు లేదూ?"

"మరేం పర్వాలేదు. కాస్త ఆనందంతో భ్రమాన్నపడిపోయానంతే."

"మాటలు బాగా వచ్చే. నన్ను కూడ నీవు ఆత్మీయంగా పిలు. నాకెంతో హాయిగా ఉంటుంది".

"థాంక్యూ"

"పైకి వెళ్దాంరా. సెక్రటరీని పరిచయం చేస్తాను."

"ప్రెసిడెంటెవరు?" మెట్లెక్కుతుండగా అడిగాను.

"కలుసు కొంటావులే. తొందరెందుకు?"

మందపాటి కళ్ళద్దాలలో నుండి చూశాడొకాయన. సుమారు నలభై ఏండ్లు ఉండొచ్చు.

"రండి. రండి" అంటూ బెంగాలీలో ఆహ్వానించాడు. ఇప్పటికే కొంత బెంగాలీ అర్థం చేసుకోగలుగుతున్నాను. చాలవరకు సంస్కృత పదాలు. కాని ఉచ్చారణలో 'అ'కు 'ఒ' అంటుంటారు.

ఆషా నన్ను ఆయనకు పరిచయం చేసింది. "మిస్టర్ నందలాల్ ఘోష్ మా సమాజ్ సెక్రటరీ. లా ప్రాక్టీసు చేస్తుంటారు. ఇతను రాజశేఖరమని నా ఫ్రెండ్. జర్నలిస్టు. మన సమాజంలో మెంబరవాలనుకొంటున్నారు."

"ప్రెసిడెంటుగారు చెప్పటమూ, వారు మెంబరు కాకపోవటం ఎక్కడయినా వుందా?" అన్నారు ఘోష్.

"ఇందులో నా ప్రెసిడెంట్ హోదా ఏమీలేదు, మెంబరుగా వచ్చానంతే" అంది ఆషా.

ఈ సమాజానికి సూత్రధారిణి ఈవిడేనన్నమాట.

★ ★ ★

ముఖర్జీ ఇంటికి నాకు అప్పుడప్పుడు ఆహ్వానం వస్తూ ఉంటుంది. ఆయన భార్య నన్ను చాలా ఆప్యాయంగా పలుకరిస్తుంది. కాని నాకు బెంగాలీ భాష రానందున ఆమెతో

సంభాషణ కొనసాగించలేక పోయేవాడిని. కాకపోయినా ముఖర్జీ కబుర్లు వేసుకొని కూర్చుంటే ఈమెకు మాట్లాడే అవకాశం కూడా దొరికేది కాదు. ఆమె పెట్టే రసగుల్లాలు, ఇతర వంటకాలు మాత్రం తెగ మెచ్చుకొనే వాడిని.

ముఖర్జీ మూడ్ కుదిరిందంటే మాత్రం ఒక్కొక్క మాటా ఊరించి చెప్పగలరు. ఆయన అభిప్రాయాలకు ఒకోసారి పొత్తు కుదరదు కూడాను.

ఆ సాయంకాలం ఐ.ఎ.యస్. పరీక్షా ఫలితాల గురించి మాట్లాడేరు. పాసయిన వారిలో దక్షిణదేశం కంటే ఉత్తరదేశం వాళ్ళే ఎక్కువున్నారట.

"దీని గురించి నీ అభిప్రాయమేమిటి?" అన్నారు.

"ఏముందండీ. బై ఛాన్సు అలా జరిగి ఉండొచ్చు."

"బహుశా అక్కడ పబ్లిక్ స్కూల్సు తక్కువేమో! ఇంగ్లీషు ప్రమాణం కూడా తక్కువయి ఉంటుంది"

నాకు చర్రున కోపం వచ్చింది. కాని ఆయనతో ఏమని వాదించను! ఉత్తరదేశంలో ఎన్నో ఏళ్ళనుండి విశ్వవిద్యాలయ స్థాయిలో మాతృభాషలో పరీక్ష పేపర్స్ రాసే వీలుంది. వచ్చినా రాకపోయినా విధిగా ఇంగ్లీషులోనే పరీక్షలు వ్రాయాలి సౌత్ ఇండియన్సు (కథా కాలంనాటి మాట). భాష పెంపొందించుకోటం వ్యక్తిగత విషయం ... కాని ఏకంగా దక్షిణ భారత దేశంలో ఇంగ్లీషు స్టాండర్డు లేదంటే ...

"ఏమిటో ఆలోచనలో పడ్డావు."

"లేదండి"

"మా కాలంలోని ఇంగ్లీషు ప్రమాణానికి, ఇప్పటికి పోలికే లేదు. నన్నడిగితే ఇంగ్లీషు భాష లేనిదే దేశాభివృద్ధి లేదంటాను."

"మాకు విశ్వవిద్యాలయ స్థాయిలో ఇంగ్లీషే బోధనా భాష" అన్నాను కాస్త గర్వంగా. వెంటనే ఆయన పెదవి విరిచారు.

"మనకు జాతీయ భాషంటూ లేకపోవటం ఎంత చిన్నతనం. ఇంగ్లీషు వాళ్ళమీది వ్యామోహంతోనే ఇంకా వారి భాష పట్టుకొని వ్రేలాడుతున్నాము. ఇంగ్లీషు వస్తేగాని నాగరికులమనిపించుకోము. అందుకే మన దేశభాషలిలా అఘోరిస్తున్నాయి."

నాకు నవ్వు వచ్చింది. ఇంగ్లీషు ప్రమాణం పడిపోయిందంటారు ఒక వైపు. దేశ భాషలు వృద్ధి కాలేదంటారు మరోవైపు.

"ఇతర దేశాల్లో చూడరాదూ. ఎన్ని ప్రాంతీయ భాషలున్నా ఒక జాతీయ భాష అందరూ ఎలా నేర్చేసుకొంటారో. దేనికైనా పట్టుదల, ఐకమత్యమూ ఉండాలి."

"సోవియట్ యూనియన్‌లో చాలా భాషలున్నాయి కదండీ."

"ఉన్నాయి. ఎందుకు లేవు? కాని రష్యను భాషరాని వాడిని ఒక్కడిని ... ఒక్కడిని చూపించు మరి. మనదేశంలోనే భాషను రాజకీయాలకు ముడిపెట్టారు. లేకపోతే చిన్న పిల్లలకు బడిలో నేర్పిస్తే భాషలు ఎంతలో వస్తాయి?"

ఆయన రష్యాకు వెళ్ళి రెండేండ్లు వుండివచ్చారు. యూరపు కూడా పర్యటించారు. ఆయన అనుభవాలు ఆయన నోటి మీదుగా వింటే బాగుంటాయి. ఆయన ప్రభుత్వమిచ్చిన స్కాలర్‌షిప్ మీద రష్యనుభాషలో అడ్వాన్స్ కోర్సు చదవటానికి వెళ్ళారు. "గుడ్‌మార్నింగ్"కు "దోబ్రయ ఊత్ర" అని రష్యన్ భాషలో అంటారని ఆయన వద్దే తెలుసుకొన్నాను. మరోనాలుగు ముక్కలు కూడ ఆయన నేర్పించారు. కాని ఇప్పుడాయన అంటారు. "అనవసరంగా కొన్ని వేలు ఖర్చు పెట్టింది ప్రభుత్వం. నా మటుకు నేను ఎంజాయ్ చేశాననుకో కాని నాభాష ఈ దేశానికి ఏ విధంగా ఉపయోగ పడినట్లు? నాతోపాటు చదివిన ఇద్దరు మిత్రులు అసలు భాష కూడా మరచి పోయారు."

ఇక దీనికి మనమేమని వ్యాఖ్యానం చెయ్యగలం తల ఊపి ఊరుకోటంగాక.

రష్యాలో ఆయన అనుభవాలు చెప్పమని మరీ, మరీ పట్టుబడితే "నాదేముంది పదిహేనేళ్ళ క్రిందటి అనుభవం" అంటూ అనాసక్తిగా మొదలు బెట్టారు. "అబ్బో సోవియెట్ యూనియన్‌లో జీవితం త్వరత్వరగా మారుతూ ఉంటుంది" అంటారు. తమని చాలా ప్రేమగా చూసుకొన్నారట అక్కడి ప్రజలు.

"భారత దేశానికి సోవియెట్ యూనియన్‌కు మంచి స్నేహసంబంధాలుగదా. మమ్మల్ని ప్రముఖ వ్యక్తుల్లా చూసుకొన్నారు. ప్రతి భారతీయుణ్ణీ సుహృద్భావంతో చూసుకోమని స్టేట్ ఆర్డరయి ఉంటుంది."

"అలా వ్యక్తిగత విషయాలు కూడ ప్రభుత్వం నిర్దేశిస్తుందంటారా?" "తప్పకుండా కాని ఇది దేశానికి సంబంధించిన విషయం కదా. ప్రతిదీ వాళ్ళు దేశం దృష్టితో చూస్తారు."

"వాళ్ళ దేశంలో రంగు విభేదాలున్నాయా" "ఊహు. రంగు" భేదాలు పాటించినట్లు కనిపించదు. మనం కూడ విదేశీయులంటే "జోహుకుం" అని నెత్తిన పెట్టుకోవటం లేదూ?"

"మీరు తెల్లదొరల విషయం చెబుతున్నారా?" అన్నాను నవ్వుతూ.

"ఆ తెల్లదొరలే. మనదేశంలో కూడ రంగు విభేదాలు ఉన్నాయబ్బాయ్ లేక పోతే పెళ్ళిళ్లలో రంగుకు అంత ప్రాముఖ్యం ఎందుకనుకొన్నావు కలర్ కాంప్లెక్స్ కాకపోతే."

కబుర్లన్నీ అయిన తర్వాత నా గదికి బయలుదేరాను.

★ ★ ★

ప్రెస్ పనితోను, పుస్తకాలతోను కాలం బాగానే గడిచిపోతోంది. ఈవినింగ్ క్లాసులు జర్నలిజంలో జరుగుతున్నాయని విని ఆ డిప్లమా కోర్సులో చేరాను. మా క్లాసులో ఇద్దరు అమ్మాయిలు కూడ ఉన్నారు. 'హలో' అంటే 'హలో' అనుకోవటమే గాని ఎవరితోను ఇంకా ఎక్కువ స్నేహం కుదరలేదు.

కళాసమాజంలో సభ్యుణ్ణి అయాను. ఒకటి రెండు కవి సమ్మేళనాలు కూడా జరిగాయి ఈ మధ్య ఆషా ఇంటికి తరచుగా వెళ్తున్నాను. ఇంత అందమైన వ్యక్తి, ధనవంతురాలు, విద్యావతీ ఎందుకు ఒంటరిగా గడుపుతోందో, మన ప్రాంతాలన్నీ వదిలి బెంగాలులో ఎందుకు స్థిరపడిందో నాకు బోధ పడలేదు. తను ఎప్పుడూ వ్యక్తిగత విషయాలు చర్చించటానికి అవకాశమిచ్చేదికాదు. మరీ తెగువగా అడగటానికి సభ్యత అడ్డువచ్చేది. అందరితో కలివిడిగా, సరదాగా మాట్లాడుతుంది. ఆమె నవ్వు పాలపొంగులా ఉంటుంది.

ఆ సాయంకాలం సంధ్య చీకట్లు అలముకొంటుండగా ఆషా ఇంట్లో అడుగుపెట్టాను. ఆషా సవ్వడి వినిపించలేదు.

లైబ్రరీకి వెళ్ళాను. లైట్లు వెలుగుతున్నాయి. ఎవ్వరూ ఉన్నట్టు లేరు. ఒక బీరువాలో పుస్తకాలు చూస్తున్నాను. బీరువాల వెనక నుండి హఠాత్తుగా మాటలు వినిపించసాగాయి. ఆషా కంఠం తీవ్రంగా ఉంది.

"సభ్యతమీరి ప్రవర్తించకు మిస్టర్ ఘోష్."

"సభ్యతేమిటి, సభ్యత? నా హృదయంలోని ఆరాటం ఏ సభ్యతకు తెలుసు? నా బాధ నీకు మాత్రం తెలీదూ?"

"నాకేమీ తెలీదు, నీ మూర్ఖత్వం గాక."

"మూర్ఖత్వమే. కాకపోతే ఇలా శలభంలా మాడిపోవలసివస్తుందా? నీ అందానికి దాసుణ్ణి కావటం, నువ్వు చెప్పే పాలరాతి శిల్పమని తెలిసీ నిన్నారాధించటం మూర్ఖత్వమే. నువ్వసలు నా జీవితంలోకి ఎందుకొచ్చావు ఆషా? నాతో చెలగాటా లెందుకాడుతావు?"

"ఊరికే మతి పోగొట్టుకోకు. నీతో చెలగాటా లెవరాడారు? కాలి పిడికెడు బూడిదగా మారే శరీరాన్ని చూసి అంత దిగజారిపోవటం నీలా ప్రణతి చెందిన వ్యక్తికి తగదు."

"నీకేం ఆషా ఎంత వేదాంతమైనా వల్లె వేస్తావు. ఇదంతా మిథ్య అని నీవంటే మాత్రం, నీ మిలమిలలాడే కళ్ళు, గులాబి బుగ్గలు, కెంపుల్లాంటి పెదవులు .... ఇవన్నీ మిథ్య అని నేనెలా అనుకోగలను? నిన్ను చూచిన క్షణం నుండి నాలో బలమైన కోరిక పాతుకుపోయింది. నీవు కరుణించకపోతే ..."

"ఆత్మహత్య చేసుకొంటావా?"

"నీకు నవ్వులాటగా వుంది!"

"నవ్వులాట కాదు మిస్టర్ ఘోష్. నా విషయం కూడా ఆలోచించు. కనిపించిన ప్రతివ్యక్తీ తన బలమైన కోరికలు వెలిబుచ్చుతూ ఉంటే వారి కోరికలు తీర్చటమే నా జీవితాశయం చేసుకోమంటావా?"

"అందరి సంగతి నాకెందుకు? నా విషయంలో 'ఊ' అను. రేపీ పాటికి నిన్ను మిసెస్ ఘోష్‌గా మారుస్తాను"

"నేనేమీ మిసెస్ ఘోష్ కావాలని తపించటం లేదే."

"నిన్నెలా దారికి తీసుకురావాలో నాకు తెలుసు." ఏదో చెప్పాడు.

"ఇడియెట్, గెటవుట్."

"ఆషా" గాండ్రు మంది ఘోష్ కంఠం. "నన్నవమానిస్తే నిన్నూ, నీ పరువు ప్రతిష్ఠలనీ ఒక్కనాటితో నాశనం చేయగలను. నీ సంగతి ఎవరికి తెలీదని! తిరుగ నేర్చిన ఆడది పెళ్ళికి ఎందుకు కట్టుబడుతుంది?"

"యూ ఫూల్ గెటవుట్. నీకు మా సమాజంలో సభ్యత్వం లేదు. గెటవుట్."

"సభ్యత్వం ఎందుకు లేదు?"

"ఈనాటి నీ ప్రవర్తన"

"దీనికి ఋజువు? కమిటీతో ఈ విషయాలు చర్చించగలవా?"

"అది నీ కనవసరం. యూ ఫస్ట్ గెటవుట్."

"సరే. నేను లేని ఈ సమాజం ఎలా బాగుపడుతుందో చూస్తాను."

"మరేం ఫర్వాలేదు. నీలాంటివాళ్లు చాలామంది ఉన్నారు."

"ఎందుకు లేరూ, ఉన్నాడుగా కొత్త పిట్ట."

"వాట్ డు యు మీన్?"

"ఐ మీన్ వాట్ ఐ మీన్. అతనింకా కుర్రవాడు. పాపం కొన్నాళ్లు సుఖంగా బ్రతకనీ ..."

బూట్ల చప్పుడు ... నాకు నవనాడులూ క్రుంగిపోయాయి. నా మొహం ఆషాకు ఎలా చూపించాలో తెలియలేదు. దగ్గరలో ఉన్న కుర్చీలో కూర్చుని బల్లపై తల వాల్చి పడుకున్నాను. నా ఉచ్ఛ్వాస, నిశ్వాసలు నాకే వినిపిస్తున్నాయి.

ఐదు నిముషాలు గడిచాయేమో! ఆషా ఇటు వస్తున్నట్లుంది. భగవంతుడే ఈ ఆపద కాపాడాలి అనుకొని కళ్లు మూసుకున్నాను.

"అరె శేఖర్" కొంచెం మార్పుతో ఆషా కంఠం వినిపించింది. నేను లేవలేదు. ఆవిడ చెయ్యి నా జుట్టుమీద పడింది. "శేఖర్ చాలా సేపయిందా వచ్చి? నిద్ర నటించకు. ఇందాక ఘోష్ అరచిన అరపుల మధ్య నీకింత గాఢంగా నిద్ర పట్టిందని నమ్మమంటావా?"

సిగ్గుపడిపోయాను. తప్పదు మరి. తలెత్తాను. ఆషా మొహంలో అదే ప్రశాంతత. కాని కళ్ళు కాస్త ఎర్రబడ్డాయి. తడిగా కూడ ఉన్నాయేమో.

ఏమీ జరగనట్లే "టీకి వెళ్దామురా," అని దారితీసింది. నేను మౌనంగా వెంబడించాను.

★ ★ ★

పై సంఘటన మూలంగా నాకూ ఆషాకూ మధ్యనున్న బంధమేదీ సడలలేదు. ఆ ప్రస్తావన మా యిద్దరి మధ్య ఎన్నడూ రాలేదు. ఆషా సాన్నిధ్యం నాకు అపరిమితమైన ఆనందాన్ని ప్రసాదిస్తుంది. తనతో గడిపే గంటలు క్షణాల్లా దొర్లిపోతాయి. ఉద్యోగ బాధ్యతలే లేకుంటే, ఆషా అభ్యంతరం చెప్పకపోతే తన ఎదురుగా ఇరవై నాలుగు గంటలూ కూర్చోగలను. కేవలం తన సౌందర్యమే నన్నీవిధంగా కట్టి పడేస్తున్నదని అనలేను. తనలో ఏదో ఒకశక్తి ఉంది. మంచితనం ఉంది. అవగాహన ఉంది. అన్నిటికీ మించి

ప్రేమార్ద్ర హృదయం ఉంది. తను నాకంటె ఎన్నేండ్లు పెద్దదో నాకు తెలీదు. కానీ, దేవతలకు వయసేమిటి?

చాలారోజుల తర్వాత కళాసమాజ్ ఫంక్షను జరిగింది. శరత్‌చంద్రుని 'పరిణీత' నాటకంగా వేశారు, ఆషా కొన్ని పాటలు పాడింది. ఆ తర్వాత పార్టీ.

పార్టీలో ఎవరెవరో కొత్తవారితో కూర్చోవలసి వచ్చింది. ప్రక్కనున్న ఓ యువకుడు నాకేసి చూస్తూ ఆంగ్లంలో అడిగాడు. "మీకు బెంగాలీ రాదా?"

రాదన్నాను. నిజానికి మాట్లాడటం రాదు గనక.

"మిస్ ఆషా మీరూ ఒకే రాష్ట్రం నుండి వచ్చారు కదూ?"

అవునన్నాను.

ఆ తర్వాత అతను తన ప్రక్కన కూర్చున్న యువతితో కబుర్లలో పడిపోయాడు. నేను ఒంటరిగా ఫీలవుతున్నాను. జీడిపప్పులు ఒక్కటొక్కటిగా నోట్లో వేసుకొంటూ చుట్టూ చూడసాగాను. వద్దనుకున్నా బెంగాలీ యువకుని సంభాషణ నాకు వినిపిస్తోంది. బాగానే అర్థమవుతోంది.

ఆ యువతి అడిగింది.

"ఘోష్ యెక్కడా కనిపించటం లేదే?"

"అతనిప్పుడు మెంబరు కాదు."

"అదేమిటి?"

"ప్రేమ వ్యవహారాలు. ఆమెకు విసుగొచ్చింది కాబోలు వెళ్ళగొట్టింది. తనకేం, కావలసినంత మంది ఉన్నారు. ప్రేమించిన వాళ్లకేగా బాధ" కాస్త నిట్టూరుస్తూ అన్నాడు.

"నీవుకూడా ప్రేమలో పడ్డావేమిటి!" ఆమె నవ్వుతూ అడిగింది.

అతను కాస్త కంగారుపడ్డాడు. "అబ్బే కడుపు నిండిన నాకు కక్కుర్తి ఎందుకు!" అన్నాడు పైకి.

ఇంతలో ఆషా హడావిడిగా ఆ వైపు వచ్చింది. "సారీ శేఖర్, అతిథుల్ని చూస్తూ నీ విషయమే మరిచా. హల్లో భువనోపాధ్యాయ, ఇక్కడే ఉన్నారే. వీరు రాజశేఖరని జర్నలిస్టు ... వీరు భువనోపాధ్యాయ ... ఏ బిగ్ బిజినెస్ మ్యాన్ ... ఆవిడ శ్రీమతి భువనోపాధ్యాయ."

ఆషాతో భువనోపాధ్యాయ ఎంతో వినయంగా, ఆదరంగా మాట్లాడసాగాడు. అతని

నక్క వినయాలు చూస్తుంటే పళ్ళు రాలగొట్టాలనిపించింది. కాని విధిలేక ఊరుకొన్నాను.

★ ★ ★

బినయ్ ముఖర్జీ అడుగు జాడలలో నడుస్తూ, జర్నలిజంలో ఆయన నేర్పిన మెళుకువలన్నీ నేర్చుకుంటున్నాను.

ఆ వారానికి 'ఇన్ దిస్ వీక్'కు కావలసిన మేటరు సమకూర్చి, టైప్ చేసి ముఖర్జీ దగ్గరకు తీసుకెళ్ళాను. ఆయన ఆమూలాగ్రంగా చదివి "నీవు మంచి జర్నలిస్టు వయిపోయావోయ్. నా ప్రమేయం లేకుండా ప్రెస్సుకు పంపవచ్చు" అన్నారు నవ్వుతూ.

"చాలా రోజులయింది మా ఇంటికి వచ్చి. ఇంటావిడ నిన్ను కలవరిస్తోంది. మా సబిత కూడా వచ్చింది. ఈ సాయంకాలం రాకూడదూ!" అన్నారు.

"సబిత ..."?

"మా రెండో అమ్మాయి. విశ్వభారతిలో చదువుకొంటూందని చెప్పాను గుర్తుందా?"

"ఆ ... గుర్తులేకేమండీ. తప్పక వస్తాను".

సాయంకాలం సబితను చూశాను. నాజుగ్గా ఉంది. చామన ఛాయ. పెద్ద కళ్ళూను.

"నమస్కారమండీ. మీ గురించి నాన్నగారప్పుడెప్పుడో వ్రాశారు. చూడటం ఇన్నాళ్ళకు పడింది" అంది.

"మీరు చిత్రకళలో దిట్టలని విన్నాను. మీ చిత్రాలు చూడాలండీ" అన్నాను.

"దిట్టనుకాదు కాని ఏదో ప్రయత్నం మాత్రం చేస్తున్నాను."

ఇంతలో ముఖర్జీ వచ్చారు.

"మా అమ్మాయి వచ్చాక ఇంట్లో సందడిగా ఉందోయ్. ఏమిటో, ఆడపిల్లల తండ్రులంత దురదృష్ట వంతులెవరూ ఉండరనుకో. ఇన్నాళ్ళుగా అచ్చటా ముచ్చటా తీర్చి పెద్దజేస్తామా, ఒక రోజు హఠాత్తుగా మనల్ని వదిలిపెట్టి వెళ్ళిపోతారు. చుట్టపు చూపుగా రావటానికి కూడా వీలు లేదంటారు. మా అరతి, అదే పెద్దమ్మాయి. పెళ్ళయి రెండేండ్లయిందా. ఇంతవరకూ ఇంటికి రానేలేదు. మరీ దూరం కూడా కాదు. ఖరగ్‌పూరే. నేనే రెండుసార్లు వెళ్ళి వచ్చాను. ఇంక కొన్నాళ్ళకు మా సబితా అంతే చేస్తుంది."

సబిత తల నిమురుతూ నవ్వారు ముఖర్జీ.

సబిత కూడా నవ్వింది.

"నాన్నగారి ధోరణి మీకు సుపరిచితమేననుకొంటా. మాట్లాడుతూ ఉండండి. టీ కలుపుకొని వస్తాను."

"టీతో పాటు మిఠాయి కూడా తీసుకురా అమ్మా. అమ్మకు చెప్పు అతిథులొచ్చారని."

"నేను క్రొత్తవాడినటండీ" అన్నాను.

"క్రొత్తవాడిని కాకపోయినా మర్యాదలో లోపం చేస్తామా" అని గొంతు తగ్గించి "నీతోపాటూ నాకూ మిఠాయి దొరుకుతుందనే నా తాపత్రయం" అని ఘొల్లున నవ్వారు.

"వచ్చేవారం ఢిల్లీకి పోవాలి ఎడిటర్సు కాన్ఫరెన్సు. నాతోపాటు నీవూ రాకూడదూ."

నాకు చాలా సంతోషమయింది. క్రొత్త ప్రదేశాలు క్రొత్త మనుష్యులు అంటే నాకు చాలా సరదా.

"ఇంతకుముందు ఢిల్లీ చూశావా?"

"లేదండి."

"ఇంకేం బయలుదేరు."

"ఏదో ప్రయాణం తలపెట్టున్నారు" అంటూ సబిత వచ్చింది టీ పట్టుకొని.

"ఢిల్లీ ప్రయాణం. ఒంటరిగా వెళ్ళలేను కదా. అందుకే శేఖరును వెంటబెట్టుకు పోతున్నాను."

"సోవియెట్ యూనియన్‌లో రెండేండ్లు ఒంటరిగా ఎలా గడిపారు నాన్నా."

"అది క్రొత్తదేశం చూడాలనే ఉబలాటం తల్లీ. అక్కడకు వెళ్ళాక చాలామంది స్నేహితులు కూడ దొరికారు." ఇంతలో ఆయన ఆలోచనలు మాస్కోదాకా వెళ్ళినట్టున్నాయి.

"ఏదో ఆలోచనలో పడ్డారు" అన్నాను.

"ఆ మరేం లేదు. ఆ రోజులు తలచుకొంటే నవ్వు వస్తుంది. మా హాస్టల్లో శుభ్రతకోసం గదులకు మార్కులిచ్చేవారు. అందరికంటే తక్కువ మార్కులు వస్తుంటే నాకు చాలా చిన్నతనమనిపించేది."

"తక్కువ మార్కులు ఎందుకు వచ్చేవి నాన్నా, మీ గది శుభ్రంగా ఉండేది కాదా?"

"నా సంగతి నీకు తెలీదమ్మా. మీ అమ్మ అన్నీ చక్కబెడుతుంటే నా అంత నీటుగా మరెవ్వరూ ఉండరు. అయినా భారతీయుల తత్త్వమేమిటో శేఖర్ నడుగు చెబుతాడు.

ఇంటిని పరిశుభ్రంగా ఉంచే పోర్టుఫోలియో ఆడవాళ్ళది. ఈ మూల ఒక చొక్కా ఆ మూల ఒక టవలూ, హాలు మధ్యలో చెప్పులూ వదిలేసి మేము వాళ్ళకు తగినంత పని కల్పిస్తూ ఉంటాము. ఒక నాటితో శుభ్రత రావాలంటే ఎక్కడినుంచి వస్తుంది?" అంటూ పెద్దగా నవ్వారు.

"మరేమయింది? ఎన్నడయినా కాస్త మంచి మార్కులు తెచ్చుకోగలిగారా?"

"నన్ను చూస్తుంటే ఎగతాళిగా ఉందా అమ్మా. మార్కులు తెచ్చుకోక తప్పింది కాదు. అందరి మార్కులూ ఒక బోర్డుమీద వేస్తారయ్యే. చివరికెలాగో సాధించాను."

"ఆ కిటుకేమిటో మాకు చెప్పకూడదూ" అని అడిగింది సబిత.

"ఇండియన్ కాస్మెటిక్సు" అంటూ పక పకా నవ్వారు.

★ ★ ★

పాత ఢిల్లీకన్నా కొత్తఢిల్లీ నాకు బాగా నచ్చింది. ఒక రోజంతా షాపింగు సెంటర్లు చూశాను. ఆషాకు, సబితకు ఒకటి రెండు చిన్న బహుమతులు కొన్నాను.

జంతర్‌మంతర్, రాజఘాట్, శాంతివన్, పార్లమెంటు భవన్, రాష్ట్రపతి భవన్ మొదలయినవన్నీ టూరిస్టు బస్సులో వెళ్ళి చూశాను. కుతుబ్‌మీనారు చూస్తుంటే చరిత్ర సజీవంగా కళ్ళెదుట కన్పించినట్లయింది.

ఒకరాత్రి ఎర్రకోటకు "సోన్-ఎ-లుమియర్" చూడటానికి వెళ్ళాను. ఆ 'షో'లో ఎర్రకోట ప్రాణం పోసుకొంది. మొగలాయిల ఔన్నత్యం కళ్ళకు కట్టింది. ఎంత చక్కటి రూప కల్పన.

ఎడిటర్ల కాన్ఫరెన్సు ముగిసింది. ముఖర్జీ, నేను తాజ్ ఎక్స్‌ప్రెస్సులో ఆగ్రాకు బయలుదేరాము. ఆ ట్రైను నాకు చాలా నచ్చింది. ప్లాటుఫారంపై నన్ను ఎక్కువగా ఆకర్షించినవి తాజ్‌మహల్ బొమ్మలు - నెమలి ఈకల విసన కర్రలు.

ఆగ్రాలో టూరిస్టు బస్సులో ముందు ఫతేపూర్ సిక్రీకి వెళ్ళాము. అక్బరు దర్బారు హాలు, దీన్-ఇ-లాహి విషయమై చర్చలు జరిపే చర్చారంగము అన్నీ చూశాము. ఆ ఊళ్ళో నీట ఎద్దడి మూలంగా రాజధాని మార్పిడి జరిగిందట.

ఆగ్రా కోటలో గోడల నిండుగా, చిత్ర విచిత్రమైన లతలు, పూవులు చిత్రితమై ఉన్నాయి. ఆ లతలలో, పూవులలో అసలైన వజ్ర వైఢూర్యాలు ఉండేవట. పై కప్పు

బంగారు పూతతో మెరుస్తూ ఉంది. ఆ మొగలాయి రాజులు పంచభక్ష్య పరమాన్నాలు తిన్నారో, బంగారం తిన్నారో అంతు పట్టకుండా ఉంది.

పాతకోట నుండి తాజ్‌మహల్ దర్శనమిచ్చింది. షాజహాను ఈ కోటలోనే ఖైదు చేయబడ్డాడట. మరణ సమయం వరకు ఆ తాజ్‌మహలును చూస్తూ ఉండేవాడట ఆ ప్రేమ పిపాసి.

తాజ్‌మహలును సమీపిస్తుంటే ఒళ్ళు పులకరించింది. ఎన్నాళ్ళుగానో కలలుగన్న తాజ్‌మహలు ... వేనోళ్ళ పొగడబడిన తాజ్‌మహల్ ... సౌందర్యం మూర్తీభవించిన తాజ్‌మహల్ ... అమరప్రేమకు ప్రతీక తాజ్‌మహల్ ... దానిలోని ప్రతి అంగుళమూ కళాఖండమే.

★ ★ ★

"ఢిల్లీ ఎలా ఉంది శేఖర్ బాబూ" నవ్వుతూ ఆషా పలుకరించింది.

"చాలా సరదాగా గడిచింది ఆషా. ప్రయాణాలంటే నాకు చాలా సరదా."

"అందుకే కాబోలు ఇంటి నుండి పారిపోయి వచ్చావు." ఉలికి పడ్డాను. ఏనాటిమాట! ఇంటి సంగతే మరచిపోయాను.

"మాట్లాడవేం" ఆషా హెచ్చరించింది.

"నీకెలా తెలిసింది?"

"ఏమిటి?"

"నేను ఇంటి నుండి పారిపోయి వచ్చానని."

ఆషా పడీపడీ నవ్వింది.

"వెనకటికి ఎవరో నా పేరు 'హనుమంతు'డని ఎలా తెలిసింది? అని అడిగారట."

నాకూ నవ్వు వచ్చింది.

"నా పేరు మాత్రం హనుమంతుడు కాదు" అన్నాను.

"అది సరే. ఎందుకు అలిగి వచ్చినట్లు?"

"చెప్పమంటావా?"

"అందుకేగా అడిగింది."

"స్వేచ్ఛగా బ్రతకాలని"

"అంటే ..."

"అంటే అమ్మా నాన్నా లేరు. పెంచిన మామయ్య పెద్ద డిక్టేటరు. ఆయన ఎదుట నోరు విప్పటం మహాపాపం. నేను పై చదువులు చదువుతానంటే మండిపడ్డాడు. చదువాపి ఇంటి వ్యవహారాలు చూసుకోమన్నాడు. తనకు నచ్చిన పిల్లను నేను పెళ్ళి చేసుకోవాలట. ఇదెక్కడి న్యాయం?"

"మన సమాజంలో ఇది సర్వసామాన్యంగా జరుగుతున్నదే కదా."

"లేదు ఆషా. మానసికంగా నేను చాలా వ్యధ ననుభవించాను. నోరు విప్పి చెప్పుకోటానికి ఒక్క ప్రాణి అయినా లేని పరిస్థితి. అంతేగాక మా ఆస్తినంతా మామయ్య హస్తగతం చేసుకొన్నాడని కూడ వీళ్ళూ, వాళ్ళూ చెప్పగా విన్నాను."

"చెప్పుడు మాటలు విని పారిపోయి రావచ్చా?"

"పోనీలే ఆషా. పారిపోయి రావడమే మంచిదయింది. కష్టాలు పడ్డా, చాలా అనుభవం సంపాదించాను. అవగాహన పెంచుకొన్నాను. లోకాన్ని చూడగలిగాను నీవంటి స్నేహమయి దొరికింది. ఇంటి దగ్గరేముంది నేను నా ఇల్లూగాక ...?"

"పోనీ ఇంటికి ఒక ఉత్తరం వ్రాయకూడదూ. ఏడాది నుండి ఎంత బెంగపెట్టుకొన్నారో!"

"ఏమీ బెంగపెట్టుకోరు. మామయ్య సంగతి నీకు తెలీదు. ఈ పాటికి నాకు తర్పణాలు కూడ వదిలేసి ఉంటారు."

"ఆయనకు పిల్లలా?"

"ఇద్దరు కొడుకులు."

"కూతుర్లు లేరా?"

"ఉహు. అందుకే ఈ మాత్రమయినా బ్రతికి ఉన్నాను."

★ ★ ★

ఆ రోజు సబిత కబురు పంపించిందని ముఖర్జీ ఇంటికి వెళ్ళాను. ఆయన ఇంట్లో లేరు. వరండాలో సాలోచనగా కూర్చున్న సబిత నా కంటబడింది. తన కెదురుగా బల్లపైన డ్రాయింగు కాగితాలూ పెన్సిళ్ళూ అస్తవ్యస్తంగా పడిఉన్నాయి.

"ఏదో కళా తపస్సులో ఉన్నట్టున్నారు." అన్నాను.

ఉలికిపడింది.

"మీరా రండి. ఏమీ తోచటం లేదు."

"మీ చిత్రాలు చూపించండి మీకు అభ్యంతరం లేకపోతే".

"అభ్యంతరమేముంది" అంటూ తన గదిలోకి తీసుకెళ్ళింది.

తన అల్బములూ, బీరువాలో పెట్టిన పెద్ద చిత్రాలూ అన్నీ తీసి చూపించింది. తనది అధునిక సంప్రదాయంలా లేదు. నాబోటి సామాన్యునికి కూడా బాగా అర్ధమయ్యే రీతిలో ఉంది. తనకు నచ్చిన దృశ్యాలు, ఊహ చిత్రాలు రంగు రంగులుగా జీవకళతో మెరిసిపోతున్నాయి.

"ఇవన్నీ ఇలా లోపల పెట్టుకోటమేనా, మరేదయినా ప్రయోజనముందా!" అన్నాను.

"అంటే ..."

"అంటే ఎగ్జిబిషనుకు పంపటమో, మరోవిధంగా ప్రచారంలోకి తీసుకురావటమో జరుగదా?"

తను నవ్వేసింది. ఆమె నవ్వులో చాలా అందముంటుంది. బుగ్గలు చక్కగా ఒంపు తిరుగుతాయి.

"నవ్వుతారేం. నన్ను ఏర్పాటు చేయమంటారా? రెండు రోజుల్లో బ్రహ్మాండమైన పబ్లిసిటీ ...."

ఈసారి మరీ గలగలా నవ్వింది.

"భలేవారండీ. నా ఆసక్తి కొద్దీ, నా తృప్తి కోసం వేసుకొంటున్నాను కానీ పదిమంది కోసం కాదుగా."

"సబితా! చాలవరకు కళాకారులూ, రచయితలూ తమ ఆనందం కోసం, తృప్తికోసం కళారాధన చేస్తారు. కాని పదిమందికీ తెలియజేయనిదే కళకు రాణింపులేదు. కళాకారులకు కూడ ఉత్సాహం కలుగదు."

సబిత నాకేసి చూస్తూ కూర్చుంది. తన ధోరణి చూస్తే నా మాటలు వింటున్నట్టు లేదు.

"ఏమిటో మీరు పరధ్యానంగా ఉన్నారు. నేను మిమ్మల్ని విసిగిస్తున్నట్లున్నాను."

"అబ్బే అదేం లేదు. ఉదయం నుండి ఈ రోజిలాగే ఉంది. ఏం తోచటం లేదు. అందుకే మిమ్మల్ని పిలిపించాను. ఇంకొక వారం రోజులు గడిస్తే చాలు. నా కాలేజి జీవితం ఉండనే ఉంటుంది."

"నిజంగా ఇక్కడ అంత విసిగిపోయారా? అమ్మానాన్నల దగ్గరికంటే ఆ కాలేజిలోనే మీకు బాగుంటుందన్నమాట."

మృదువుగా నవ్వింది.

"ఏదైనా సినిమాకు వెళ్దామా?"

"నేను రెడీ."

దగ్గరలోనే ఉన్న థియేటరుకు బయలు దేరాము. ఏదో హిందీ సినిమా. బెంగాలీ పిక్చరు వద్దంది సబిత.

ఆ సినిమాలో దుస్తులు, సెట్టింగులు అన్నీ బాగున్నాయి గాని కథ పోకడే బాగలేదు. కథానాయిక నిరుపేద. అందమైన కథానాయకునితో పరిచయమవుతుంది. ప్రతినాయకుడు ధనవంతుడు. నాయిక తండ్రి అతనికి ఋణపడి ఉంటాడు. దానికి బదులుగా అతని కూతుర్ని పెళ్ళి చేసుకొంటానంటాడు ప్రతినాయకుడు. పెళ్ళి ప్రయత్నాలు జరుగుతుంటాయి. కథానాయకుడు వీళ్ళింటి ముందుగా పాట పాడుతూ పోతుంటాడు. కథానాయిక పెళ్ళి దుస్తులలో అతని వద్దకు పరుగెత్తి వస్తుంది. అప్పుడు నాయకునితో ప్రతి నాయకునికి ముష్టియుద్ధం ...

సబిత చాలా విసుక్కుంది. "చచ్చేంత బోర్‌గా ఉంది" అంది.

చివరకు ఎలాగో సినిమా ముగించుకొని బయటపడ్డాం.

"ఈ ఊళ్ళో ఫిలిం సొసైటీ ఒకటి ఉంది. మీకు తెలుసా?" అంది సబిత.

"విన్నాను. అన్ని దేశాల నుంచీ మంచి చిత్రాలు ఎన్నికచేసి తెప్పించి మెంబర్సుకు చూపిస్తారట కదా."

"ఊఁ. నేనూ మా అక్కా రెండేండ్లపాటు మెంబర్సుగా ఉన్నాము. ఆ తర్వాత అరతికి పెళ్ళయిపోయింది, నేనూ విశ్వభారతికి వెళ్ళిపోయాను."

"ఫిలిం సొసైటీలో చాలామంచి పిక్చర్సు చూసి ఉంటారు."

"ఓయస్. అప్పుడు చాలా ఎంజాయ్ చేసేదాన్ని. ఎంతోవేగంగా తయారవుతున్న మన

సినిమాల్లో క్రొత్తదనం లేకుండా పోతోంది. ఒక సినిమా సక్సెస్ అయిందంటే, అదే ధోరణిలో చాలా పిక్చర్లు వచ్చేస్తాయి. కొంచెం వైవిధ్యం ఉంటేనే కదా ఆసక్తి కలిగేది?"

"నిజమే. మంచి ఆలోచనలుండి సినిమాలు తీయాలంటే నష్టపోతామేమోనని నిర్మాతలు వెనకాడుతారు. లక్షలతో వ్యవహారం. తెలిసి, తెలిసి ఎవరు రిస్క్ తీసుకోగలరు చెప్పండి. మీ బెంగాలీ సినిమాలు ముఖ్యంగా సత్యజిత్ రే తీసినవి అంతర్జాతీయంగా పేరు తెచ్చుకొన్నాయి. అదే ధోరణిలో అతి సహజంగా మానసిక సంఘర్షణను ఇతివృత్తంగా తీసికొన్న తెలుగు సినిమా ఒకటి ఊరూ పేరూలేకుండా పోవడం నేనెరుగుదును."

"నేను చాలా విదేశీ ఫిల్ములు చూశాను. కేవలం హాలీవుడ్ సినిమాలు కాదనుకోండి. హంగేరియన్, చెకోస్లావేకియన్, సోవియట్ యూనియన్, జర్మన్ ఫిల్ములు, జపనీస్ ఫిల్ములు చూశాను. ఇంగ్లీషు, అమెరికను ఫిల్ముల సంగతి సరేసరి. కొన్ని ఫ్రెంచి ఫిల్ములూ చూశాను. మన సినిమాలలో లేని క్రొత్త క్రొత్త థీమ్స్ చూసి చాలా ఆనందించాను. ఆ ఫిల్ములు ఎంతో నీట్‌గా ఉన్నాయనిపించింది."

"ఫ్రెంచి ఫిల్ములు, కెనెడియన్ ఫిల్ములు జనాదరణ పొందటానికి మనవాళ్లు మరో కారణం కూడా చెబుతారు."

"ఓ అదా? ప్రేక్షకుల బలహీనతలను రెచ్చగొట్టటం, ఒకవిధమైన మనోవైకల్యం కలిగించటం ఆ సినిమాల్లోనే కాదు మన సినిమాల్లో కూడ కనిపిస్తుంది. సోషలిస్టు దేశాల ఫిల్ములు కాస్త కట్టుదిట్టాలలో తయారయినా గుండెలు పిండేసే అంతటి హ్యూమన్ అప్పీలు ఉంటుంది. ఎక్కువగా వాళ్లు రెండవ ప్రపంచ యుద్ధానికి ముడిపెట్టి తమ సినిమాలు తీస్తారనుకోండి. కానీ వాళ్ళు హాస్యాన్ని ప్రధానంగా తీసుకొని చిత్రించిన చిత్రాలు కడుపుబ్బ నవ్విస్తాయి. వాటిలో రవంత అయినా కృత్రిమత్వం ఉండదు. ఎవరూ గొంతు చించుకొని, నీతి అవినీతుల గురించి లెక్చర్లు దంచరు. చెప్పాలను కొన్నది వాళ్లు చిత్రీకరిస్తారు. మంచిచెడులు నిర్ణయించుకోవలసింది మనం."

ఇంతలో సబిత యిల్లు రానే వచ్చింది.

"అబ్బ, మాటల్లోపడి ఇల్లు దగ్గరవటంకూడ గుర్తించలేదు." అంది సబిత.

"మీ మూడ్ కుదిరిం దనుకొంటారు."

"ఓ యస్. నా వాగుడంతా ఓపిగ్గా విన్నందుకు థాంక్సు."

"వాగుడేమీ కాదు. ఐ రియల్లీ ఎంజాయ్డ్ ఇట్."

"ఇంట్లోకి రారూ?"

"నో థాంక్సు. ఇప్పటికే ఆలస్యమయింది. వస్తాను. గుడ్ నైట్."

"గుడ్ నైట్"

ఆ రాత్రి పడుకున్న తర్వాత చాలసేపటివరకు నిద్ర పట్టలేదు. సబిత గురించి ఆలోచిస్తున్నాను. సబిత నాకంటే రెండు మూడేండ్లు చిన్నదే. అయినా తన మనస్సు చాలా పరిపక్వం చెందినట్లు తోస్తుంది. అన్నింటి గురించి తీవ్రంగా ఆలోచిస్తుంది. ఏ మాత్రం సంకోచం లేకుండా మాట్లాడుతుంది. అదే మా ఊర్లో అయితేనా ... ఆడపిల్లలు బాయ్సను చూడగానే శత్రువులను చూసినట్టు ముడుచుకు పోయేవారు. వాళ్ళకు ఎన్నెన్నో పేర్లు పెట్టి అనాగరికంగా నిర్దాక్షిణ్యంగా కూడా ఏడిపించేవారు. అదో లోకం. పరస్పరావగాహనకు తావేదీ? ఎప్పుడూ పరాయివాళ్ళ గురించి అవాకులూ చెవాకులూ వాగడమే అక్కడి వారి హాబీ. ఏ క్రొత్త విషయాలనూ అర్థం చేసుకోరు. తమనూ తమ ఆలోచనలనూ సంకుచితం చేసుకొని, ఆ విషవాయువులు పీలుస్తూ, తమ చుట్టూ అవే వ్యాపింపజేస్తుంటారు.

ఈ రోజు సబితతో కలిసి సినిమాకు వెళ్ళాను.... ఆ తర్వాత సినిమాలను గురించి స్వేచ్ఛగా చర్చించుకున్నాము. వేలకొద్దీ కథల్లో వస్తున్న రీతిగా మేమేమీ తడబడలేదు. పులకించలేదు. ఒక స్నేహితుడు మరో స్నేహితునితో మాట్లాడుకొన్నట్టే ఉంది.

అసలు స్త్రీ ప్రతిక్షణమూ తాను స్త్రీననే భావంతో ఇతరులంతా తనను చూచి ప్రలోభ పడిపోతారు అనుకోవటం ఒక విధమైన వ్యభిచారమేనని ఒక ప్రముఖ నవలాకారుడు అన్నాడు. నిజమే మరి ... అంతగా సెల్ఫ్ కాన్షియస్‌గా ఉండవలసిన అవసరమేముంది?

ఆలోచనల మధ్య ఎప్పుడో నిద్ర పట్టేసింది. కలలు కూడ అస్తవ్యస్తంగా వచ్చాయి.

★ ★ ★

ఆఫీసుకు వెళ్ళగానే, ముఖర్జీ ఆందోళనగా కనిపించారు.

"శేఖర్, నీలిమ ఆస్పత్రిలో ఉంది. చూసి వద్దాం పద."

"నీలిమా? ఏమయింది? నిన్న నేను ఆమెను పలుకరించానే!"

"అవునవును. నిన్న సాయంత్రం ఓ గంట ముందుగానే పర్మిషన్ తీసుకొని వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి పైకి అలా నవ్వుతూ కనిపిస్తోంది గాని పది, పదిహేను రోజులుగా ఆమె మనసేమీ బాగాలేదని గ్రహించాను.

"ఏమిటమ్మా" అని అడిగాను కూడ. తను నవ్వి ఊరుకొంది. వ్యక్తిగత విషయాలు ఏమున్నాయో తరచి అడగటం ఎందుకు లెమ్మని ఊరుకొన్నాను. కారు సిద్ధంగా ఉంది. అరగంటలో తిరిగి వచ్చేద్దాం పద".

కారులో కూర్చున్నాక అడిగాను.

"నీలిమకు ఏమయిందింతకూ?"

"ఆత్మహత్యా ప్రయత్నం" ఎదురుగా వస్తున్న స్కూటరును తప్పిస్తూ అన్నారు.

ఉలికిపడ్డాను. నీలిమ ... నవ్వుతూ, నవ్విస్తూ పిల్ల కాలువలా పరుగెత్తే నీలిమ... చిన్న పిల్లవాడిని బెదిరించినట్లు నన్ను బెదిరించి టైపు నేర్పిన నీలిమ ... కలువ పువ్వులాంటి నీలిమ ఆత్మహత్య చేసుకోవాలని ఎందుకనుకొంది? తనకంత కష్టం ఏమి వచ్చింది? ముఖర్జీని అడగలేక పోయాను. రద్దీగా ఉన్న రోడ్డుపైన కారు నడుపుతున్నారాయన. ఆలోచనలతో ఆయన నుదుటిపై ముడుతలు పడుతున్నాయి.

నీలిమ తల్లి కాబోలు మంచం దగ్గర కుర్చీలో కూర్చుంది. మమ్మల్ని చూడగానే లేచి నిల్చుని తలమీదకు చెంగు లాక్కుని నమస్కరించింది.

నీలిమ వడలిన పువ్వులా పడుకొని ఉంది. కళ్ళు తెరచి చూసిందిగాని మమ్మల్ని గుర్తించినట్లు లేదు. మరలా కళ్ళు మూసేసుకొంది.

నీలిమ తల్లితోపాటు మేమిద్దరమూ వరండాలోకి వచ్చాము.

"అమ్మాయి ఎందుకిలా చేసింది?" అని ముఖర్జీ అడిగారు.

నీలిమ తల్లి భోరున ఏడ్చేసింది.

"దానికి వచ్చిన కష్టాలేమిటో నాకు అర్థం కావటం లేదు బాబూ. నాలుగయిదేండ్లుగా ఉద్యోగం చేస్తూ ఒక విధంగా ఇంటికి మగదిక్కయింది.

తమ్ముడిని చదివిస్తోంది.

ఆయన పోయినప్పుడు నా కన్నీరు తుడిచి, ధైర్యం చెప్పి సంసారాన్ని ఒక కొలిక్కి తెచ్చింది. మరిప్పుడు దాని మనసులో ఏముందో ... రాత్రి ఏం మింగిందో తెలీదు. అర్థరాత్రి

డొక్కుంటుంటే వెళ్ళి చూశాను. మనిషంతా మెలికలు తిరిగిపోతోంది. ఈ లోకంలో ఉన్నట్లు లేదు. పక్కింటి వారిని లేపి వారి సాయంతో ఇక్కడ చేర్పించాను." కొంగుతో ముక్కూ, కళ్ళూ తుడుచుకుంది.

"నిన్న మీ ఇద్దరి మధ్యా ఏమైనా గొడవ జరిగిందా?"

"అదేమీ లేదు బాబూ. ఈ మధ్య తన పెళ్ళి విషయమై హెచ్చరిస్తున్నానంతే. మొన్న రాత్రి కూడా ఆ విషయం గట్టిగా అడిగాను. అదేమీ వ్యతిరేకించలేదు. నిన్న అసలు నేనా ప్రస్తావనే తీసుకు రాలేదనుకోండి."

"సరే. మీరేమీ గాభరా పడకండి. డాక్టరుతో నేనన్ని విషయాలూ మాట్లాడుతాను."

ముఖర్జీ లోపలికి వెళ్ళారు. నేను వరండాలో నిల్చుని పూల మొక్కలకేసి చూస్తున్నాను. పెళ్ళి విషయంలో నీలిమ కలత పడిందా? మరి తన భావాలు తెలిపి, ఆ విషయాన్ని చర్చించి సమస్యను పరిష్కరించుకొనే ధైర్యం ఆమెకు లేకపోయిందా?

ముఖర్జీ వచ్చారు. నీలిమ తల్లిని ఉద్దేశించి "మీ అమ్మాయికేమీ పర్వాలేదన్నారు డాక్టరు. రెండు మూడు రోజుల్లో ఇంటికి వెళ్ళిపోవచ్చు. కాని అమ్మాయికి ఈ సంగతులేవీ చెప్పకండి. నేను మళ్ళీ సాయంత్రం వస్తాను." అన్నారు.

మరో ఇరవై నిముషాల్లో ఆఫీసు చేరుకున్నాము. ఇద్దరమూ ఒక్క మాటయినా మాట్లాడుకోలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళం ఉండిపోయాము.

ఆ సాయంకాలం ఎక్కడికీ వెళ్ళాలనిపించలేదు. సబిత పిలుపు గుర్తుంది కాని ఈ మూడ్‌లో వెళ్ళి తనకూ నా విషాదాన్ని పంచటమెందుకని ఊరుకొన్నాను.

★ ★ ★

మరునాటి సాయంకాలం ఆఫీసు నుండి నేరుగా నర్సింగ్‌హోమ్‌కు వెళ్ళాను. నీలిమ తలగడలకు ఆనుకొని కూర్చుని ఓవల్టిన్ త్రాగుతోంది. నన్ను చూడగానే పాలకమారింది. అది సర్దుకోటానికి ఐదు నిముషాలయింది. అలసిపోయినట్లు పడుకొంటూ నీరసంగా నవ్వింది.

"ఇప్పుడు కులాసాగా ఉందా?" అన్నాను.

సిగ్గుపడినట్లు కళ్ళు వాల్చేసుకొంది. నేను తీసుకెళ్ళిన గులాబీలు, యాపిల్ పండ్లు బల్లపైన పెట్టాను.

కాస్సేపు కూర్చుని "ఇక వస్తాను" అని లేచాను. నీలిమ నెమ్మదిగా అడిగింది.

"అందరూ నా గురించి ఏమనుకొంటున్నారు?"

"ఏమీ అనుకోటం లేదు. మీరు దీనిగురించి బాధపడుతున్నారు కాబోలు. మందులు వేసుకోటంలో పొరపాటు జరిగిందని ముఖర్జీ ఆఫీసులో చెప్పారు."

"అలాగా ... మరి మీరేమనుకొంటున్నారు?"

"నేనా ... మీరు విశ్రాంతిగా పడుకోవాలనుకొంటున్నాను."

నీలిమ నవ్వింది. "మీరు మంచివారు. నాకు తెలుసు" అంటూ గొణిగింది.

"నేనిక వెళ్ళిరానా!"

"మరలా ఎప్పుడు వస్తారు? మీతో చాలా మాట్లాడాలి."

"మాట్లాడటం ఇప్పుడు కాదు. రెండు రోజుల్లో ఇంటికి వచ్చేస్తారు కదూ, అప్పుడు మాట్లాడుకొందాం. ఇక సెలవా?"

తల ఊపింది.

గదికి చేరుకొనేసరికే ఏడు దాటింది. వరండాలో లైటువేసి తెల్లబోయాను. ఆషా పిట్టగోట మీదనుంచి లేచి నిల్చుంది. "భలేవాడివే, చప్పుడు కాకుండా వచ్చావు."

"నీవు మాత్రం చప్పుడు లేకుండా కూర్చోలేదూ." తనను అనుకోకుండా చూడటం నాకెంతో ఆనందంగా ఉంది.

"కూర్చున్నప్పుడు చప్పుడు చేస్తూ కూర్చుంటారని నాకు తెలీదే" అంది కుర్చీలో కూర్చుంటూ. "ఇంత దయ కలిగిందే నాపైన, కారణం తెలుసుకో వచ్చా?" అన్నాను.

"అంటే కారణం లేనిది నీ గదికి రాకూడదన్నమాట. అయినా గొప్ప జర్నలిస్టు వయ్యావు. స్నేహితులను కూడా మరచిపోతున్నావు."

"లేదు ఆషా. రెండు మూడు రోజులుగా జర్నలిజం క్లాసుకు కూడా పోవటం లేదు. మొన్న సబిత కబురంపింది. నిన్న నీలిమ ఆస్పత్రిలో చేరింది. మనసేమీ బాగాలేదు."

"నీలిమా ... నీలిమెవరు?"

"గుర్తులేదా ఆషా. తను నాకు టైపింగ్ నేర్పింది. ముఖర్జీ సెక్రటరీ."

"ఏమయింది?"

"మామూలుగా జబ్బుపడితే ఇంత బాధ కలిగేది కాదేమో ఆషా? మొన్నరాత్రి ఏదో మందు త్రాగింది ఆత్మహత్య చేసుకోటానికి."

ఉలికిపడింది ఆషా. "వెళ్ళి చూసివద్దాం శేఖర్"

"నయమే. ఇప్పుడు విజిటింగ్ టైము కూడా కాదు. కాకపోయినా నిన్ను తీసుకెళ్ళాలని లేదు."

"ఏమిటో చాలా సీరియస్‌గా మాట్లాడేస్తున్నావే."

"నిజం ఆషా. నీలిమ ఇప్పటికే సిగ్గుతో చితికిపోతోంది. విజిటర్లు ఎక్కువయ్యేకొద్దీ తను మరింత బాధపడుతుంది."

ఆషా ఏం మాట్లాడలేదు.

"వెరీ సారీ ... ఆషా"

"ఇట్సాల్‌రైట్. చలో, అలా చల్లగాలికి తిరిగివద్దాం."

"భోజనం చేస్తావా ఆషా, కొంచెం సేపటిలో కారియర్ వస్తుంది. ఈ బీదవాడి ఆతిథ్యం స్వీకరిస్తావా?"

"సరే సరే. ఆ బీదరిక మేదో నేనూ రుచి చూస్తానులే."

మేము అలా తిరిగి వచ్చేసరికి భోజనం సిద్ధంగా ఉంది. టేబులుపైన అన్నీ అమరుస్తుంటే ఆషా కూడ సాయం చేసింది. ఆమె కబుర్లతో నా మనసులోని బాధ అంతా చేత్తో తీసివేసినట్లయింది. ఆషాను వాళ్ళింటి వద్ద విడిచి వచ్చేసరికి తొమ్మిదిన్నర అయింది. రవీంద్రుని "క్రెసెంట్ మూన్" చదువుతూ నిద్రలోకి జారాను.

★ ★ ★

నీలిమ ఇంటికి వెళ్ళటం అదే ప్రథమం. తను ముందుగదిలో కూర్చుని ఏదో పత్రిక చదువుతోంది. నన్ను చూడగానే సంతోషంగా ఆహ్వానించింది.

"రండి. రండి. అసలు మరచిపోయారేమో ననుకొన్నాను."

"అదేంమాట, మీ విశ్రాంతిని చెడగొట్టాలనిపించలేదు. అందుకే కొంచెం ఆలస్యం చేశాను."

"ఇంకెంత విశ్రాంతి కావాలండీ. చాలు చాలు. ఇప్పటికే ఎక్కువయి పోయింది. ఈ సోమవారం నుంచి ఆఫీసుకు కూడా రావాలనుకుంటున్నాను."

నీలిమను పరికించి చూశాను. తను మునుపటి నీలిమే, చక్కని పలువరస తళుక్కుమంటోంది తను నవ్వినప్పుడల్లా.

"అమ్మకు చెబుతాను. టీ తయారు చెయ్యమని."

"ఇప్పుడే తీసుకొని వచ్చాను. ఈ మర్యాదలన్నీ పాటించవద్దు."

"మీకు అక్కర లేకపోయినా నాకు కావాలండోయ్. ఓవల్టీన్ త్రాగి త్రాగి విసుగొచ్చేసింది" అంటూ లోనికి తుర్రుమంది.

టీ, బిస్కెట్లు తీసుకొన్నాక

"ఇంట్లో ఉండీ ఉండీ బోర్ కొడ్తుంది" అంది.

"ఎక్కడికైనా వెళ్ళి రాకపోయారా" అన్నాను.

"ఎక్కడికి వెళ్ళను. అమ్మకు నన్ను ఒంటరిగా పంపాలంటే భయం పట్టుకుంది."

"నిజమే మీరు చేసిన పనికి ..."

"ఆగిపోయారేం. కానివ్వండి, అందరూ నాలుగక్షింతలు వేస్తేగానీ నేను బాగుపడను."

"లేదు లేదు మిమ్మల్ని తప్పు పట్టటం లేదు."

"మరేం ఫర్వాలేదు ... ఉండండి ఒక్క క్షణంలో వచ్చేస్తాను. పార్కుదాకా వెళ్దాం."

త్వరలోనే ఎర్రంచు తెల్లచీర కట్టుకొని వచ్చింది. పార్కులో గడ్డిపైన కూర్చున్నాము. దూరంగా రంగు రంగుల దీపాల్లో నీటి ధారలు వింతగా మెరుస్తున్నాయి. నీలిమ ఆ నీళ్ళనే చూస్తూ కూర్చుంది.

"ఏమిటి నీలిమా చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు."

తను నవ్వి తల దించుకుంది. తన కళ్ళలో లీలగా నీళ్ళు మెదులుతున్నాయి.

"ఆఫీసుకు రావాలంటే అదో చిన్నతనంగా ఉంది." అంది నెమ్మదిగా.

"చిన్నతన మెందుకు? అంత కానిపని ఏం చేశారని?"

"కాదామరి. ఆడది ఆత్మహత్య చేసుకోబోయిందంటే చిలువలు పలువలు అల్లి చెప్పుకోరూ. అన్నిటికంటే ముందు శీలాన్నే శంకిస్తారు కదూ!"

"ఛ ఛ. ఈ పిచ్చి భయాలేమీ పెట్టుకోకండి, అసలు ఆఫీసులో ఎవరికీ ఈ విషయం తెలీదు." తన కళ్ళలో కృతజ్ఞత మెరిసింది.

"అయినా ఇంత సాహసం మీరెందుకు చేసినట్లు?"

తను మోకాళ్ళలో మొహం దాచుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది. తనను చనువుగా

అనునయించే సాహసం నాకు కలగలేదు. తనను తాను సంబాళించుకొంటూ "నాకు ఏమీ మిగల్లేదు శేఖర్ దా. ఆ క్షణంలో ఆత్మహత్యే శరణ్య మనిపించింది" అంది.

మొదటిసారిగా నీలిమ నన్ను ఆత్మీయంగా సంబోధించింది.

"అమ్మ నవనాగరిక ప్రపంచంలో మసలుతూ ఉన్నా తనకు చాలా పాత ఊహలున్నాయి. కులాలు, మతాలు, సంప్రదాయాలు లేకుండా తను ఆలోచించలేదు. నాన్నగారు పోయినప్పటి నుండి ఇంటి బాధ్యత నేను నెత్తిన వేసుకొన్నా అమ్మ నాకు తగిన వరుణ్ణి వెతుకుతూనే ఉంది. నా ఊహలు అమ్మ ఊహలు ఎప్పుడూ సరళ రేఖలే శేఖర్ దా."

"అందుకని అమ్మమీద కోపం కొద్దీ ..."

"కాదు ... కాదు. అంత త్వరగా నా చర్యను గర్హించకు. ఇద్దరు అపరిచితులను పెళ్ళి పేరుతో కట్టివెయ్యటం నువ్వయినా సమర్థిస్తావా?"

"ఏదో ఈ కాలంలో వ్యక్తి స్వాతంత్ర్యాలు, విశాల హృదయాలు, ప్రేమలూ, పరస్పరావగాహనా అంటున్నాము కాని ముందునుండీ ప్రేమ వివాహాలు ఎక్కడున్నాయి నీలిమా?"

"నిజమే. అటువంటివి అడపాదడపా ఉన్నా అవి పురాణాలలో మాత్రమే. అవి దైవ సంకల్పంతో, మహత్తరమైన ప్రయోజనాలకోసం జరిగినట్లు భావిస్తాము. కాని నేటి కాలం ఎంతమారిందో గమనించకపోతే ఎలా? మన పూర్వులకు బస్సులు లేవు. ట్రాములు లేవు. ఫాన్‌లు, కూలర్లు ఎరుగరు. సినిమాలంటే తెలీదు. ఈ ఆధునిక సౌకర్యాలు వాళ్ళకు లేవని మనం వాటికి దూరంగా ఉన్నామా? లేదు. మరి పెళ్ళిళ్ళ విషయంలో మాత్రం పాత పద్ధతులకు ఇంత ప్రాముఖ్యం ఎందుకు?"

"మరి వేరే మార్గం లేనివారి మాట ఏమిటి? అందరికీ ఆ అవకాశాలూ లేవు. స్వతంత్ర భావాలూ ఉండవు".

"పోనీ అందరి సంగతీ ఎందుకు? నా సంగతి చెప్పనీ. నన్ను ప్రేమించి అభిమానించే వ్యక్తిని కోరుకోటం దురాశా? అతనిని పెళ్ళి చేసుకోవాలనుకోటం పాపమా?"

"లేదే. అలా ఎవరనగలరు? అంటే నీవు మెచ్చిన వ్యక్తి ఒకరున్నారన్న మాట. మీ అమ్మ ఒప్పుకోరనే భయంతో నీవు ..."

"నా కథకు అంత త్వరగా ముగింపు తీసుకురాకు. ఇది ఇంటర్వెల్లుకు ముందు. ఆ తర్వాత ..." తను నవ్వింది. అది నవ్వుకాదు గుండెను కదిలిస్తున్న శోకం. హృదయానికి ఎక్కుపెట్టిన బాణం.

"తర్వాత ఏమయింది నీలిమా?"

"మిణుగురు పురుగులు చూసి నిప్పురవ్వలనీ, ఎండమావులు చూసి జలాశయాలనీ భ్రమపడ్డాను దా. ఈ పరుగులోని అలసట, అక్కడి నిరాశా నన్నీ విధంగా క్రుంగదీశాయి."

నాకు అర్థం కాలేదు.

"మన కరస్పాండెంటు చక్రవర్తి తెలుసుగా?"

"ఆ అతను తెలియకేం. ప్రస్తుతం సెలవుమీద ఉన్నాడనుకొంటా."

"అవును. ఆయన చాలా పెద్ద మనిషి. సభ్యత తెలిసినవాడు. తియ్య తియ్యటి కబుర్లు చెబుతుంటే ఆశయాల శిఖరాల మీదనుండి ఉపన్యాసాలిస్తుంటే నాకెంతో ముచ్చట వేసింది. అంతటి ఉన్నత వ్యక్తి నాకు తారస పడటం నా అదృష్ట మనుకొన్నాను. అమ్మను వ్యతిరేకించి, నా పుట్టిల్లే లేదనుకొని అతనితో నా జీవితం ముడి పెట్టుకొందామనుకొన్నాను. సెలవు పెట్టి వెళ్తూ, మరీ అవసరమైన పనిమీద వెళ్తున్నాననీ, నన్ను విడిచి ఉండటం క్షణమొక యుగంగా గడపటమనీ, రెక్కలు కట్టుకొని వచ్చి వాలుతాననీ మరీ మరీ చెప్పి వెళ్ళాడు. పదిహేను రోజుల క్రితమే అతని దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. ఏమనో ఊహించగలవా?"

"ఏముంది? అమ్మా నాన్న మరో సంబంధం చూశారు కాబోలు."

"నో ... నో ... అంతకంటే ఘోరం.

తను స్కూలు ఫైనలు పూర్తి చేయగానే పెద్దల బలవంతాన పెళ్ళి చేసుకొన్నాడట. ఇద్దరు కూతుర్లూ, ఒక కొడుకూ ఉన్నారట. కాని భార్యవద్ద తనకు కావలసిన ప్రేమ, మనశ్శాంతి లభించలేదట. యమ యాతన భరించలేక ఇక్కడికి వచ్చేశాడట. నా ప్రేమామృతం అతని వాడిన హృదయాన్ని చిగురింప జేసిందట. ఇంతలో తల్లికి జబ్బుగా ఉందని ఆ ఊరు వెళ్ళవలసి వచ్చింది. ఇంటి పరిస్థితులేమీ బాగు లేనందున తను అక్కడే ఉండక తప్పదట. అక్కడే ఏదో ఉద్యోగం కూడ దొరికిందట. తన నిస్సహాయ స్థితిని మన్నించమన్నాడు. బలమైన సంకెళ్లలో నుండి తను చేసే ఆక్రందన వినిపించుకోమన్నాడు.

నాలో ఏ మాత్రమయినా ప్రేమ మిగిలి ఉంటే తనవద్దకు వచ్చెయ్యమన్నాడు. పెళ్ళి సాంఘిక వ్యవస్థ మాత్రమేనట. దానికి అంత ప్రాముఖ్యం లేదట. ప్రేమజీవులు ఇటువంటివి లక్ష్యపెట్టరట ..."

"అంటే అతని ఉద్దేశ్యం ...?"

"ఇంకా ఉద్దేశ్యాలేమిటి శేఖర్ దా.... సంఘంలో తన కీర్తికి రవంతయినా కళంకం రాకూడదు. తన కుటుంబం మామూలుగా కొనసాగాలి. నేను మాత్రం 'వాంప్'గా మిగిలిపోవాలి."

నేను నిర్విణ్ణున్ని అయ్యాను.

"ఇదీ శేఖర్ దా నేను కోరిన వ్యక్తి నాకిచ్చిన ప్రతిఫలం. అమ్మకేమో నా పెళ్ళి గురించి దిగులు పట్టుకొంది. ఇంతగా విసిగిపోయిన ఈ జీవితంలో జీవించటానికి మాత్రం ఏముంది? ఆత్మహత్య సమస్యలు తీరుస్తుందనుకొన్నాను కాని ఇలా నవ్వులపాలు కావలసి వస్తుందనుకోలేదు."

"నవ్వులపాలూ కాదు. ఏమీ కాదు. కానీ నువు మాత్రం తొందరపడ్డావు."

"తొందర లేకుంటే మాత్రం చేసేదేముంది? టెల్ మీ వాట్ ఈజ్ వర్త్ లివింగ్. నా ప్రాణం నేను తీసుకోటానికి కూడ ప్రతిబంధకాలేమిటి? నా సమస్యలా తీర్చరు. పరిష్కార మార్గం వెతుక్కోనివ్వరు. నరకం ఎక్కడో లేదు. ఇక్కడే ఉంది."

"ఎంత పిచ్చిగా ఆలోచిస్తున్నావు నీలిమా. ఆత్మహత్య సమస్యలకు పరిష్కార మనుకొనేవారు పిచ్చివాళ్ళు. ఈ శరీరం నశిస్తుంది కాని కోరికలతో వ్యధలతో నిండిన నీ ఆత్మ ఏమవుతుంది. తర్వాత అది పడే యాతన మాత్రం ఊహించగలవా? నీవు ఏడ్చి ఉపశమనం పొందగలవు. నీ ఆత్మ ఏడవలేదు. బాధ ఇముడ్చుకోలేదు."

"చావు తర్వాత జీవితం ఉందంటావా?"

"జీవితమంటే ఈ బాహ్య కార్యకలాపాలు కాదు. మన ఆలోచనలు, ఆశలు, బాధలు, వ్యధలు జీవించే ఉంటాయి రూపరహితంగా."

"నేను నమ్మను."

"నమ్మవద్దులే. రోజూ భగవద్గీత చదువు. నీకది మొదట్లో విసుగ్గా, అర్థరహితంగా ఉన్నా చదువు. ఆ తర్వాత నిన్ను నీవే తెలుసుకుంటావు."

"నీకింత పరిణతి ఎలా వచ్చింది శేఖర్ దా. నువ్వూ చాలా కష్టాలు పడ్డావా?"

"అ - మాటల్లో చెప్పలేనంతగా. చిన్నప్పటినుండీ నా మనసూ నలిగిపోయింది. కష్టాల ఒరిపిడికి నాలోని మానవత్వం క్రొత్త మెరుగులు దిద్దుకొంది."

"నువ్వెప్పుడయినా ప్రేమించి దగా పడ్డావా?"

"లేదు. కానీ అదొక్కటే జీవితంలో ఉన్న దుఃఖం కాదు. అందరిలో ఉంటూ అందరికీ దూరంగా ఒంటరిగా హృదయం పడే బాధ కూడా తక్కువేమీ కాదు. ఈ మాటల కేమిలే. ఎదురు దెబ్బలు తిన్నా ధైర్యంగా ముందుకు సాగుతూ ఉండటం నేర్చుకో నీలిమా."

"శేఖర్ దా. వయస్సులో చిన్నవాడివో, పెద్దవాడివో గాని నాకెంతో సన్నిహితుడిగా కనిపించావు. నా హృదయభారం తీర్చుకొన్నాను. ఈ విషయాలన్నీ గుప్తంగా ఉంచుతావు కదూ."

"నన్ను నమ్ము నీలిమా" తన చేతిలో చేయి వేశాను. చీకట్లు ముసురు కొంటున్నాయని ఇంటిముఖం పట్టాం. "నీవు ఏ విషయంలోనూ అధైర్యపడకు నీలిమా. నీ పరిస్థితులన్నీ కుదురుకొంటాయి. ఒక్కొక్కసారి పెద్దలు కుదిర్చిన సంబంధాలు కూడా బాగా కలిసివస్తాయి."

"నువు కూడా పెద్దలు కుదిర్చిన సంబంధాన్నే చేసుకొంటావా?" నా చెంప చెళ్ళుమనిపించినట్లయింది.

"నేనింకా ఏమీ నిర్ణయించుకోలేదు నీలిమా. ఇంకా నేను జీవితంలో స్థిరపడలేదు."

★ ★ ★

జర్నలిజం క్లాసులో రిపోర్టింగుకని మమ్మల్ని కొన్ని కరువు ప్రాంతాలకు వెళ్ళి రమ్మన్నారు. రెండురోజుల పని. మరునాడు సబిత వెళ్ళిపోతున్నందున ఈరోజే పలుకరించి రావాలనుకొన్నాను. ముఖర్జీ ఇంట్లోనే ఉన్నారు. సబిత నన్ను చూసి ప్రసన్నంగా నవ్వింది.

"మిమ్మల్ని కలుసుకోవటం ఇక పడదనే అనుకొన్నాను. నాన్నగారు ఇప్పుడే మీ ప్రయాణం గురించి చెబుతున్నారు."

"మిమ్మల్ని చూడాలనే వచ్చానండీ."

"అయితే వెళ్ళమ్మా సబితా. నీ అతిథికి ఏం మర్యాదలు చేసుకొంటావో చేసుకో. ఇదిగో ... ఇంటావిడా. సబితకోసం నీవేమీ హైరానా పడకు. తన పనులు స్వయంగా చేసుకో గలదులే" అన్నారు ముఖర్జీ.

"ఏమిటండీ పెద్ద ... ఆ మాత్రం టీ పెట్టలేనంటారా?" అని తెచ్చుకోలు కోపంతో లోపలికి వెళ్ళింది సబిత.

"సబిత ఈ ఏడాది చదువు పూర్తి చేస్తుంది. ఇంక పెళ్ళి చేసెయ్యాలోయ్. నిన్న మొన్నటి అమ్మాయి. ఇంతలో ఇరవై ఏండ్లు గడిచిపోయాయి."

నేనేమీ మాట్లాడలేదు.

"ఏదో బుద్ధిమంతుడు, కాస్త పిల్లను ప్రేమగా చూసుకొనేవాడూ దొరకాలి. అమ్మాయి కళ్ళముందే ఉంటే మరీ బాగుంటుంది. ఈ ముసలితనంలో ఇంక మిగిలింది మాత్రం ఏముంది?"

నేను ఇప్పుడూ ఏమీ మాట్లాడలేదు.

"ఏవో సంబంధాలు చూసినా అమ్మాయికి నచ్చని పెళ్ళి మాత్రం చేయలేను. రాత్రి నాకో అద్భుతమైన ఆలోచన వచ్చింది. నీవేమీ అనుకోవంటే చెబుతాను."

"భలేవారే. నేననుకోట మేమిటండీ."

"సబిత నీతో ఉన్నప్పుడు చాలా సంతోషంగా ఉన్నట్లే కనిపిస్తోంది. నీకూ అమ్మాయిపట్ల ప్రేమాభిమానాలున్నాయి. మీ ఇద్దరికీ నచ్చితే ... ఏమంటావు?"

నిరుత్తరుణ్ణి అయ్యాను. ఆయన ఇంత స్పష్టంగా అడుగుతారని గానీ, ఆయనకా భావముందనిగానీ, నాకు తోచలేదు.

"ఇదంతా ముసలివాడి ఎత్తుఅనుకోకు. మీ ఇద్దరిలో ఎవరికి నచ్చకపోయినా ఈ పెళ్ళి జరగదు. అంతమాత్రాన మన స్నేహ సంబంధాలకు భంగం కలుగదు."

ఇంతలో సబిత రానే వచ్చింది. నాకు జవాబు చెప్పే బాధ తప్పింది. టెలిఫోను రింగుమంది. ఆయన ఎవరితోనో ఏదో మాట్లాడారు. ఆ తర్వాత "నేను అర్జంటుగా బయటకు వెళ్ళే పనుంది శేఖర్. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్. వస్తాను" అని వెళ్ళిపోయారు.

సబిత నన్ను తోటలోకి తీసుకెళ్ళింది. "రండి మా తోట చూద్దురు గాని. వంటకు కూరగాయలన్నీ ఇక్కడే దొరుకుతాయి." అంది.

జామ చెట్టుక్రింద పచ్చికలో కూర్చున్నాము.

"మీరు కూడా విశ్వభారతిలో చేరండి" అంది సబిత.

"డబ్బుండొద్దూ" అన్నాను.

"మిమ్మల్ని చూస్తే డబ్బుందనే అనిపిస్తుంది."

"బాగుంది. మొహాన వ్రాసి ఉంటుందా ఏమిటి? జర్నలిజం కోర్సుకే బోలెడు ఖర్చవుతోంది".

"ఇంక పై చదువులు చదవరా?"

"చదువుతాను. కొన్ని యూనివర్సిటీలు ప్రైవేటుగా చదువుకోనిస్తున్నాయిగా నా వంటివారిని."

వ్రేళ్ళతో గడ్డి తెంపుతూ ఆలోచిస్తోంది సబిత. "నాన్నగారు మిమ్మల్ని అడిగిన విషయం విన్నాను. మీ అభిప్రాయం వినాలని ఉంది" అంది హఠాత్తుగా.

నేను మళ్ళీ ఇక్కట్టులో పడ్డాను.

"అదే మిమ్మల్ని అడిగితే" అన్నాను.

తను మొహం ప్రక్కకు తిప్పుకొంది.

"యూ ఆర్ మై ఫ్రెండ్, దట్సాల్" అంది సన్నటి స్వరంతో. "మిమ్మల్ని బాధ పెట్టానా" అంది బేలగా.

"నో, నో నన్ను మీ మిత్రునిగా భావించినందుకు సంతోషంగా ఉంది."

"ఈ రెండు మూడు నెలలయిపోతే ఇంటికి శాశ్వతంగా వచ్చేస్తాను. ఆ తరవాత జీవితాన్ని తలుచుకోటానికే భయమేస్తోంది."

"భయమా? ఎందుకూ?"

"నాకు జీవితమంటే చాలా భయం. నా చుట్టూ ఉన్నవారి జీవితాలలోని అల్లకల్లోలాలు నాకు తెలుసు. తెలిసి తెలిసీ అశాంతిని చేపట్టటం ఎలాగో అర్థం కావటంలేదు."

"అంటే ..."

"అంటే పెళ్ళి అన్ని అనర్థాలకూ కారణమని నా ఉద్దేశం. ఉదాహరణకు మా అక్కనే తీసుకోండి ఎంత చక్కగా నవ్వుతూ త్రుళ్ళుతూ తిరుగుతూ ఉండేదని! ఏడాది క్రితం మిస్ కారేజ్ అయింది. అప్పటినుండి దాని ఆరోగ్యమే పాడయింది. ఎప్పుడూ రోగిష్టిలా మత్తుగా పడిఉంటుంది. మా పిన్నికూతురు డెలివరీలో చచ్చిపోయింది. దానిదీ, నాదీ ఒకే వయస్సు. మా చుట్టాలావిడ ఎంతో అందంగా నాజూగ్గా బంగారు తీగలా ఉండేది. ఇప్పుడు

పిల్లలయ్యాక రోడ్డు రోలరులా తయారయింది. ఈ విషయాలలా ఉంచండి. నాతో చదువుకొనే ఒక అమ్మాయికి పెళ్ళయి ఆరు నెలయినా కాలేదు ఇంతలో భర్త కారు యాక్సిడెంట్‌లో పోయాడు. ఇంకొక అమ్మాయి భర్త పేరుకు మాత్రమే భర్త. అతని కార్యకలాపాలన్నీ మూడోరకం మనుష్యులతో. పక్కింటి వాళ్ళమ్మాయి ఆత్మహత్య చేసుకొంది. మొగుడు రాచిరంపాన పెడుతున్నాడని... ఇలా ఎన్ని ఉదాహరణాలైనా ఇవ్వగలను. ఒకరినొకరు తిట్టుకొంటూ ద్వేషించుకొంటూ తప్పనిసరిగా ఒకే ఇంట్లో జీవిస్తున్న వారి నెరుగుదును. తరచి చూస్తే ఈ వివాహంలో సుఖమే మరీచిక అనిపిస్తోంది."

"ఇంత దూరంగా ఆలోచించారు గాని అమ్మానాన్న ఎంత సఖ్యంగా ఉన్నారో మీరు గుర్తించలేదా?"

సబిత మౌనంగా ఉండిపోయింది.

"మీ ముందున్న వెలుగంతా మరచిపోయి చీకటి కోణాలవైపే దృష్టి మళ్ళిస్తున్నారు."

"అమ్మా నాన్నా ప్రేమమయులు. వారి బిడ్డగా పుట్టటం నా అదృష్టమే. కానీ వారి మధ్య బేదాభిప్రాయాలు రాలేదని మీరనుకొంటున్నారా?"

"ఇద్దరు వ్యక్తులున్న చోట భేదాభిప్రాయాలు రాకుండా పోవు, అంతమాత్రంతో వాళ్ళ పరస్పరానురాగం, అవగాహన అబద్ధం కావు."

"అమ్మా నాన్నలకంటే నాపైన పరిసరాల ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ సంఘటనలోని విరోధాభాసమే నాకు అర్థం కాదు"

"ఏమిటంటారు?"

"మాటలకు చేతలకు పోలికే ఉండదు. నా విషయం అందరిలాంటిది కాదనుకోండి. దేవుని దయవల్ల లక్షా తొంభై కట్టుదిట్టాలు లేకుండా పెరిగాను కాబట్టి కాస్త స్వతంత్ర భావాలు వచ్చాయి."

"అవి కాస్త నా చెవిని కూడా వేస్తే ధన్యుణ్ణి."

"ఇదిగో ఈలాంటి వేళాకోళాలే నాకు నచ్చవు."

"కోపం వద్దు సబితా. ప్లీజ్ నీ భావాలు తెలుసుకొంటే నాకు నూతన దృక్పథం ఏర్పడవచ్చు."

"చాలా ఫ్రాంకుగా మాట్లాడుతాను. ఏమీ అనుకోకండి, ఆడపిల్లను అసలు పెళ్ళికోసమే అన్నట్లు ఎందుకు పెంచుతారో చెప్పండి. ఒంటరిగా ఉన్న స్త్రీలకు సమాజంలో గౌరవం ఎందుకు లేదో చెప్పండి. పైకి బాగానే ఉన్నా వెనుక ఎందుకు తక్కువగా అంచనా వేస్తారు? సమాజంలో సమస్తమైన హక్కులూ మీరే గుత్తకు తీసుకొన్నారా?"

"ఇదేమిటండోయ్, నామీద విరుచుకు పడుతున్నారు. సమాజంలో ఏదో విరోధాభాస ముందంటూ మగజాతిని దుయ్యపడ్తున్నారే?"

"అవును. అన్ని అనర్థాలకూ కారణం మగవాడి ఆధిక్యం. యుగయుగాలుగా ఆ అధిక్యం క్రింద నలిగిపోతూ తమని తాము గుర్తించుకోవటమూ, సమానత్వాన్ని ఆశించటమూ కూడ మహాపాపంగా భావిస్తున్నారు స్త్రీలు. ఒకరిద్దరు శృంఖలాలు వదుల్చుకొని వచ్చినా వారిని చిత్తుగా పడగొట్టేవరకు రాళ్ళు విసురుతూనే ఉంటుంది సంఘం."

"ఎటువంటి సమానత్వం కావాలని మీరు కోరుకొంటున్నారు?"

"ఆడపిల్లల పెళ్ళి విషయమేచూడండి. వాళ్ళను చాలా కట్టుదిట్టాల్లో పెంచుతారు. మగవాణ్ని కన్నెత్తి చూడొద్దంటారు. తోడేలుకు గొర్రెపిల్లలు దూరంగా ఉండినట్లు ఉండమంటారు. ఎవరి స్నేహార్ద్ర హృదయానికైనా ఈ పిల్ల లొంగిందంటే, కులట, పతిత అని నిందిస్తారు. వేలకు వేలు ఖర్చుపెట్టి అట్టహాసంగా చేసే పెళ్ళిలో ముక్కూ మొఖం ఎరుగని వాడిని తన సర్వస్వంగా భావించుకోవాలి. అతని ఇష్టాలే తన ఇష్టాలు. ఇన్నాళ్ళూ భయపడుతూ వచ్చిన తోడేలునే నేడు పూజించాలి. ఇంత మార్పు ఒక్కసారిగా ఆశించటం అసమంజసం కాదా? చిన్నప్పటి నుంచీ నూరిపోసిన నీతిబోధలు వీరి హృదయాల్లో పెళ్ళిపట్ల జుగుప్సను కలిగించటం లేదా? వీళ్ళు మాల్ అడ్జెస్టెడ్‌గా తయారయారంటే ఆశ్చర్యమేముంది?"

ఉద్రేకంతో ఎర్రబడిన ఆమె మొహంకేసి చూస్తూ కూర్చున్నాను. సంఘంలో కుళ్లు ఎంతో ఉంది. కాని దానికి ఈ ఇరవై ఏండ్ల అమ్మాయి ఇంత రియాక్టు కాగలదని అనుకోలేదు. అవును. ఎవరనుకొంటారు? ఆడపిల్లల ఆలోచనల గురించి పట్టించు కొనేదెవరు? వారిని మన ఊహల్లో బంధించి మన కిష్టమొచ్చిన రీతిలో మలచుకొని అదే వాళ్ళ వ్యక్తిత్వ మనుకొంటాం. వాళ్ళ ఇబ్బందులను వాళ్ళ దృష్టినుంచి ఎందుకు ఆలోచించాలి? వాళ్ళందరూ సంఘం మూసలో పోసిన బొమ్మలు కాదని మనమెందుకు అనుకొంటాం?...

సబిత తన ఆలోచనల్లో ఉండిపోయింది. ఆమె కళ్లలో లీలగా నీళ్లు కదులుతున్నాయి. ఈ భాగ్యవంతురాలికి, ఈ విద్యావంతురాలికి, తల్లిదండ్రుల ప్రేమానురాగాలు సంపూర్ణంగా పొందిన ఈ పిల్లకు ఇంత దుఃఖమేమిటి?

సబిత నా చేతిమీద చేయి వేసింది. ఉలికి పడ్డాను.

"ఈ ధోరణిలో ఆలోచిస్తుంటే ఎన్నటికైనా పెళ్ళి చేసుకోగలనా అనిపిస్తుంది. ఈ భయాలు ఉత్తుత్తి కబుర్లతో తొలిగేవేనా? నాన్నగారికి మాత్రం ఏమని విశదపరచను?"

"మీ భయాలన్నీ నాకు అర్థమయ్యాయి సబితా. మీరు చెప్పిన విషయాల్లో నిజం లేకపోలేదు. కానీ మీరు వ్యతిరేక దృక్పథాన్ని పెంపొందించుకున్నారు. అది ఆరోగ్యప్రదం కాదు. నేను స్నేహితునిగా మీకు కొన్ని సలహాలిస్తే పాటిస్తారా?"

"చెప్పండి."

"మీ కాలేజీలో మీ క్లాసులో మగపిల్లలు లేరూ?"

"ఉన్నారు."

"వాళ్ళతో ఎవ్వరితోనూ మీకు పరిచయం లేదూ"

"ఉంది. దానికీ దీనికీ సంబంధం ఏమిటి?"

"ఏమీ లేదు. నేనూ మగవాడినే కదా. నాతో కలిసి తిరిగినప్పుడు, మాట్లాడినప్పుడూ నా విషయమై జుగుప్స కలిగిందా?"

"అదేం మాట. ఎంతో హాయిగా ఉంటేనూ."

"ప్రస్తుతానికి మీ పెళ్ళి సమస్య కాదు. కనీసం కొన్ని నెలలయినా ఈ బెడద మీకు ఉండదు. ఏ సమస్యనైనా రెండు విధాలా పరిశీలించటం నేర్చుకోవాలి. లేకపోతే 'ఇల్లాజికల్' అవుతుంది. మీ క్లాస్‌మేట్సుతో, ముఖ్యంగా బాయ్స్‌తో కాస్త అరమరికలు లేకుండా తిరగండి. తర్వాత తీరిక సమయాల్లో బార్బారా కార్ట్లాండ్, సారాసీల్, కాథరిన్ బ్లెయిర్ వంటి వారి రొమాంటిక్ నవలలు చదవండి. అవి నమ్మశక్యంకాని కలలనిపించినా వాటిని చదవండి. మీ ధృక్పథాన్ని మార్చటానికి అవి సహాయ పడతాయని నా ఉద్దేశ్యం."

"చూడండి. ఇంతలోనే నా వ్యక్తిత్వాన్నే మార్చటానికి మార్గాలు వెతుకుతున్నారు."

నాకు నవ్వు వచ్చింది.

"మీకంటే అనుభవం కలవాడిని. మీ మేలుకోరి చెబుతున్నాను. చిన్నపిల్లలకు బూచి అంటే భయమయినంత మాత్రాన అది వాళ్ళ వ్యక్తిత్వమని విడిచిపెట్టగలమా? అదీగాక ఇంకో విషయం కూడా మీరు బాగా ఆలోచించాలి. మీకిప్పుడు అన్ని విధాలా ప్రేమాభిమానాలు లభిస్తున్నాయి కాబట్టి అది లేని జీవితం ఎలా ఉంటుందో ఊహించలేరు. అమ్మా నాన్న ఎల్లకాలం వెంట ఉండరు. ఇప్పుడున్న స్నేహితులు వాళ్ళ వాళ్ళ జీవన మార్గాలను వెతుక్కొంటూ పోతారు. అప్పుడు ఒక్కరుగా జీవించటం శాపంగా పరిణమిస్తుంది. మిమ్మల్ని మనసారా ప్రేమించి జీవితానికి సంపూర్ణత్వం కలిగించే వ్యక్తి దొరికే అవకాశం వివాహంలో ఉంది. తీపి చేదు కలిస్తేనే జీవితం, అవన్నీ తీరిగ్గా ఆలోచించండి."

చుట్టూ చీకట్లు అలముకొంటున్నాయి. ఇంట్లోదీపం వెలిగింది. మేము లోపలికి దారితీశాము.

★ ★ ★

క్షామ ప్రాంతాలు స్వయంగా చూసి రిపోర్ట్ వ్రాయటానికి నేను, ఫొటోలు తీయడానికి ఫొటోగ్రాఫర్ బీరేంద్ర సాహా బయలుదేరాము. పగలంతా దగ్గరలో ఉన్న రెండు మూడు పల్లెలు చూసి సాయంత్రానికి ఇంకో పల్లె చేరుకొన్నాము.

పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. పొలాలు ఎండి బీటలు వారాయి. త్రాగే నీళ్ళు అపురూపమయ్యాయి. ప్రభుత్వం వారు నీళ్ళు సరఫరా చేస్తున్నారుగాని ఆ బండి వచ్చిన సమయంలో అందరూ క్యూలో నిల్చొని ఒకటి రెండు బిందెలు తెచ్చుకుంటె గొప్ప. ఆలస్యంగా వచ్చిన వాళ్ళకు నీళ్ళే ఉండవు.

ఆ పల్లెల్లో మిద్దెలు, మేడలు ఎక్కడాలేవు. అందరూ పూరి గుడిసెల్లోనే ఉన్నారు. ఏదో అపూట కాపూట గడుపు కొనేవాళ్ళే. పంటలు పాడవగానే చిన్న కారు రైతుల పనే కష్టమయింది. ఇక కూలిజనం సంగతి చెప్పాలా? మనుషుల్లో ఆకలి తాండవిస్తోంది. గంజికేంద్రంలో గంజి పోయించుకు తెచ్చుకోవడమే గగనం. అందులో కీచులాటలు, తోసుకోవటాలు, కొట్టుకోవటాలు.

ఆకలి కడుపులు, జీర్ణవస్త్రాల మధ్య ఫ్లాస్కు, వాటర్ బాటిలు, తినుబండారాల బ్యాగ్ పట్టుకొని, నాగరికంగా దుస్తులు ధరించి మేమిద్దరం నడిచి పోతుంటే నాకెంతో సిగ్గనిపించింది.

మనమెన్నో ఆరోగ్య సూత్రాలు నేర్చుకొంటాం. ఒకరి ఎంగిలి మరొకరు తినం. శుచిగా

స్నానం అదీ కానిస్తే కాని భోంచెయ్యలేం. కాని మనం తిని పారేసిన ఆకుల్లో మెతుకుల కోసం, కుక్కలతో, కాకులతో పోటీ పడుతూ ఆవురావురు మనే వారిని చూస్తే మొహం పక్కకు తిప్పుకొంటాం.

ఆకలి చాలా చెడ్డది. అది మహా అగ్ని, నిజంగా ఆకలితో మాడేవానికే తెలుసు ఆ బాధ. ఆ స్థితిలో దేవేంద్రుడైనా ఎంగిలి మెతుకులు ఏరుకొంటాడంటే ఆశ్చర్యం లేదు.

సాయంకాలం ఆ పల్లెచేరుకొనేసరికి బాగా అలిసి పోయాము. ఎండలో తిరిగామేమో తలనొప్పి ప్రారంభమైంది. ఆకలి దంచేస్తోంది. ఆ ఊళ్లో వీధిబడి అనబడే ఒక గదిలో మకాం చేశాం. త్రాగటానికే నీళ్ళు దొరకని ఊర్లో స్నానం చెయ్యటం, కనీసం కాళ్ళూ, మొహం కడుక్కోటం అసాధ్యమే. చేతులు మురిగ్గా ఉన్నాయి. కాళ్ళు దుమ్ముకొట్టుకొన్నాయి. అయితే మాత్రం కడుపు ఊరుకొంటుందా? చేతులు టవలుకు తుడుచుకొని రొట్టెల పొట్లాలు పైకి తీశాం.

మేము రావటం, అక్కడికి వెళ్ళటం అంతా వింతగా చూస్తున్న ఊరి ప్రజలు ఒక్కరొక్కరే తొంగి చూస్తున్నారు. మా ఎదుట తిండి. వాళ్ళకళ్ళలో ఆకలి. వారందరికీ పంచిపెట్తే తలో ముక్కయినా రాదు. మధ్యాహ్నం నుండి ఆకలికి అలమటిస్తున్న మేము పస్తుపడుకొనే స్థితిలో లేము. అప్పుడే లేచాడు మాలోని రాక్షసుడు. సాహా వారిని బెంగాలీలో తిట్టి తలుపు బిగించాడు. కిటికీ తలుపులూ వేశాడు. ఆ మసక చీకట్లో ఆకలి రాక్షసుల్లా తినటం మొదలు బెట్టాము. వాటర్ బాటిల్ తెరిచి చెరికొంచెం నీళ్ళు నోట్లో పోసుకున్నాము. అదికాస్త ఖాళీ అయింది. సాహాకు బ్రెడ్ ముక్క గొంతులో అడ్డుపడింది. గాబరాగా తలుపు తీసి వాటర్ బాటిల్‌తో బయట పడ్డాను.

మేము తలుపులు వేసుకోగానే అందరూ వెళ్ళిపోయినట్లున్నారు ఒకరిద్దరు పిల్లలుగాక.

"నీళ్ళెక్కడ దొరుకుతాయి" అని అడిగాను.

వాళ్ళలో ఒకడు కిసుక్కున నవ్వాడు. ఇంకొకడు "దొరకవు" అన్నాడు. అవును. నా తిండి ఎత్తుకు పోతారనే భయంతో తలుపు వేసుకొన్న నేను నీళ్ళకోసం వీళ్ళని యాచిస్తే నీళ్ళెవరిస్తారు?

"పైసలిస్తాను" అన్నాను.

వాళ్ళు తల అడ్డంగా తిప్పివెళ్ళిపోయారు. ఆ ఒక్క క్షణంలో డబ్బు విలువేమిటో నాకు తెలిసి పోయింది.

ఆ సందులో నడుస్తూ వెళ్తున్నాను. చిరిగిన బట్టలతో, మాసిన గడ్డంతో ఒక వ్యక్తి ఎదురు పడ్డాడు. అందరి అవతారాలూ ఒకలాగే ఉన్నాయి అక్కడ.

"మంచినీళ్ళు దొరుకుతాయా?" అన్నాను.

భళ్ళున నవ్వాడు. ఏదో గొణిగాడు.

"చెరువో, బావో ఏదైనా ఉందా?"

"చెరువు ఎండిపోయింది" అని వెకిలిగా నవ్వాడు. "నా కొడుకు రక్తం... నా కొడుకు రక్తం..." అని గొంతెత్తి ఏడుస్తూ "తాగు, తాగు" అంటూ పారిపోయాడు.

ఒక పాక ముందు ఒక ముసలావిడ కనిపించింది.

"నీళ్ళు దొరుకుతాయా?" అని అడిగాను.

"చాలాదూరం బాబూ. రోజుకు మేము రెండు బిందెలు తెచ్చుకొంటాం. పాపం పరాయి ఊరినుండి వచ్చినట్లున్నారు. రండి. రెండు గ్లాసుల నీళ్ళిస్తాను."

తలవంచి ఇంట్లోకి వెళ్ళాను. ఒక పక్క ఆవు, దూడ నెమరు వేస్తున్నాయి. ఎముకల పోగుల్లా ఉన్న అవి ఏమి నెమరు వేస్తున్నాయో నాకర్థం కాలేదు.

"ఏం కరువొచ్చింది నాయనా. ఇంత చెడ్డకాలం మేమెన్నడూ ఎరగం. మా తాతగారి కాలంలో ఎప్పుడో వచ్చిందట. ఎంతగవర్నమెంటోళ్ళయినా ఎందరికని పెట్టారు? ఆ వాన దేవుడు చల్లగా చూసుంటే ఏదో రెండు పూట్లా కడుపుకింత దొరికేది." గ్రామాల్లో మాట్లాడే బెంగాలీ ఉచ్చారణతో మాట్లాడింది. కొన్ని కొన్ని మాటలు అర్థం కాకపోయినా భావం అర్థమవుతూనే ఉంది. ఇంతలో ఇందాకటి మనిషి ఇంటిముందు పోతూ కనిపించాడు.

"పెద్దమ్మా అతనికి పిచ్చా?" అని అడిగాను.

ఆమె నిట్టూర్చింది. "కరువు కాలం ఇలాగే ఉంటే ఈ వూరందరికీ అదే గతి పట్టొచ్చు. ఎవరి కర్మను ఎవరు తప్పించగలరు?"

ఇంత వరకు నా వెనుక చొక్కా కొసను ఆవుదూడ నములుతూ ఉంది. నేనా సంగతి గమనించనే లేదు. ఆవిడ దూడనదిలించింది. నా చొక్కా నలిగినలిగి చిరుగులు పడింది.

"ఈ గొడ్లు ఎంత కరువున బడ్డాయంటే మనుషల్నే పీక్కు తినేటట్టున్నాయి." మందలింపుగా దూడ మూతిపై కొట్టింది.

"అతనికి కరువు వల్ల పిచ్చెక్కిందా పెద్దమ్మా?"

"కాకపోతే ఏమిటి బాబూ" అంటూ అతని కథ చెప్పింది. ఆమె వాడిన ఊతపదాలూ, జాతీయాలు ఓ పట్టాన అర్థం కాకపోయినా క్లుప్తంగా ఆ పిచ్చివాడి గురించి ఈ మాత్రం అర్థమయింది.

రామ్‌దీన్ ఆవూళ్ళో చిన్నచిన్న పనులు చేసి పొట్టపోసుకునేవాడు. రైతులింత ఇస్తే జీవితం గడుపుకొనేవాడు. కరువు వల్ల ఏ పనీ దొరకలేదు. తిండిగింజలు రాల్చేవారూ లేకపొయ్యారు. పెళ్ళాం గుడ్డిది. ఒక రాత్రి ఆమె చెరువులో పడిపోయింది. నీళ్ళు తక్కువేగాని ఆమె తల రాతికి తగిలి చచ్చిపోయింది. ప్రమాదం అని కొందరన్నారు. తనే చచ్చిందని మరికొందరన్నారు. అది జరిగిన వారానికి వాడి రెండేండ్ల కొడుకు జ్వరంతో చచ్చిపోయాడు. "బువ్వ, బువ్వ" అని కలవరిస్తూ, దానితో రామ్‌దీన్‌కు మతిపోయింది. "నా కొడుకును నేనే చంపాను, నేనే చంపాను" అని ఏడ్చాడట. అప్పటినుండి మతి చెడి అలా తిరుగుతున్నాడట. అసలు బిడ్డకు ఏకాయో కసురో పెట్టిచంపాడేమోనని కొందరనుకొన్నారట.

ఆ కథ వినగానే కడుపులో కెలికినట్లయింది. ఆకలి ఎంత దారుణమైందో అర్థమయింది. మనం నలగని బట్టలేసుకొని, ఏదో విధంగా కడుపు నింపుకొని కరువు కాటకాల గురించి వ్యాసాలు, రిపోర్టులు వ్రాస్తాం.

పేగులు తెంపే ఆకలి గురించి ఎంతమందికి తెలుసు? ఈ దేశంలో గాంధీజీ ఊహించిన కన్నీటిని తుడిచి, ఆకలి కడుపులు నింపే కాలం నిజంగా ఎప్పుడొస్తుందో? దానికి మన కర్తవ్యమేమిటి? కాగితాలపై కవిత్వాలా? కమిటీల ప్రతిపాదనలా? భాషా పాండిత్యాన్ని వేనోళ్ళ చాటే ఉపన్యాసాలా? నాలో నేనే మథన పడుతూ వాటర్ బాటిల్ పట్టుకొని నా సహాధ్యాయి సాహా ఉన్న వీధిబడి చేరుకొన్నాను.

★ ★ ★

నా జర్నలిజం కోర్సు పూర్తయింది. సాయంకాలాలు కాస్త విరామం దొరికింది. చల్లగాలికని పార్కుకు బయలుదేరాను. అనుకోకుండా భువనోపాధ్యాయ కలిశారు. ఆనాటి పార్టీలో పరిచయం తర్వాత మా పరిచయం పెరగలేదు.

"హలో కులాసానా?" అన్నాను.

"కులాసాయేనండి. మీరెలా ఉన్నారు?"

"ఏదో ఇలా ఉన్నాను. ఈసారి ఎండలెక్కువగా ఉన్నట్లున్నాయి."

ఇద్దరం లాన్‌లో కూర్చున్నాము.

"ఏమిటి ఒక్కరే వచ్చారే" అని అడిగాడు.

"నాకు తోడెవరున్నారు?"

"అహ. మీతో మిస్ ఆషా రాలేదా?"

"మీకు కనిపించకుండా దాచుకున్నానా?"

ఆయన అసహజంగా నవ్వుతూ "దాచుకొన్నారేమో నాకేం తెలుసు?" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు.

"జర్నలిజం ఎలా ఉంది?"

"బాగుందండీ. ముఖర్జీ ధర్మమా అని ఒక మనిషిగా నిలబడ గలిగాను"

"ఆయనకూ మీతో ఏదో పని పడే ఉంటుంది. ఈ కాలంలో ఊరికే ఎవరు చేస్తారండీ ఉపకారం."

ముఖర్జీకి నావల్ల ఒరిగేదేమిటో నాకు అర్థం కాలేదు. మట్టిని మలచి బొమ్మను చేసినట్లు ఓపిగ్గా నన్ను తీర్చిదిద్దారు. ఈ మనుష్యుల తత్వం ఏమిటోగాని తమకు ఉదారగుణం లేకపోతే పోయింది ఎదుటివారి గురించి అయినా ఒక మంచిమాట మాట్లాడరు.

"ఈ మధ్య సమాజ్ మీటింగుకు వెళ్ళారా?"

"లేదండి. కాస్త పరీక్షలూ, అవీ బిజీగా ఉన్నాను. ఈ మధ్య రిపోర్టింగుకని కొన్ని పల్లెటూళ్ళు తిరగవలసి వచ్చింది. ఈ క్షామం చాలా దారుణంగా ఉందండీ. వారి ఆకలి బ్రతుకులు, మురికి జీవితాలు చూస్తుంటే మనం కడుపునిండా తిని విశ్రాంతి తీసుకొంటున్నామనే భావనే సిగ్గు కలిగిస్తున్నదండీ." "చూడగా మీరేదో రిఫార్మిస్టులా కనిపిస్తున్నారు. మరి ఆషాలాంటి లక్షాధికారిణులు ఉండాలంటే అటువంటి ఆకలి బ్రతుకులుండక తప్పదు కదూ!" నన్ను పదే పదే రెచ్చ గొట్టాడేమిటి ఈ మనిషి?

"కాదంటారా? లేక మీరూ లక్షాధికారులేనా?"

"మీ ఉద్దేశమేమిటి? ఆషా తన సర్వస్వం నేడే అందరికీ పంచి పెట్టి తనూ బికారిలా వీధిలో నిల్చుంటే దేశం బాగుపడిపోతుందా? వారికి కావలిసింది తిండిగింజలు. మీరూ ధనవంతులు లాగే ఉన్నారు. మీ ధనం వాళ్ళకు పంచి పెట్టకూడదూ. మీ సిల్కు లాల్చీ బదులు ముతక లాల్చీ వేసుకోకూడదూ?"

అతను ఒక్క క్షణం నివ్వెరపోయాడు.

"భలేవారు. ఆషామీద ఈగనైనా వాలనిచ్చేలా లేరు. ఘోష్ మీకంటే ఎక్కువగానే ఆమెగారిని అరాధించాడు. తనూ ప్రేమ నటించింది. ఇంతలో మోజు మారినట్లుంది."

ఏదో చల్లగాలికని వస్తే పీడాకారంలా పట్టుకొన్నాడేమిటి? ఒళ్ళు కాగిపోతోంది అతగాడి మాటలకు.

"ఎనీహౌ, ది ఛాన్స్ ఈజ్ యువర్స్. బెస్టాఫ్ లక్" అంటూ పైకి లేచాడు.

"వాట్ డిడ్ యు సే" అన్నాను తీవ్రంగా.

"అబద్ధం కాదు. ఈ అవకాశం బాగా ఉపయోగించుకొని కాస్త డబ్బు చేసుకోండి. ఫ్రెండ్లీ అడ్వయిజ్ ..."

వాడి చెంపలదిరి పోయి కళ్ళజోడు జారి పచ్చికపై పడింది. గారపళ్ళలో నుండి రక్తం తొంగి చూసింది. ఇతరుల దృష్టి మా మీద పడకముందే విసవిసా నడిచి వచ్చేశాను.

ఆషా . . . దేవతలా పవిత్రంగా మెరిసే నా ఆషా గురించి అంత లోకువగా మాట్లాడటమా? అందరూ ఆమె దగ్గర ఉపకారం పొందిన వారే. అందరూ ఆమె స్నేహాన్ని వాంఛించే వారే. వాళ్ళే ఆమెను చాటుగా నిందిస్తారు.

ఆ రాత్రి అంతా చాలా కలతతో గడిచింది.

★ ★ ★

చాలా రోజుల తర్వాత నా దేవి ఆషా ఎదుట మంత్ర ముగ్ధునిలాగా కూర్చున్నాను. తను తంబుర మీటుతూ తీయగా పాడుతోంది.

ఆ పాట భావ మేమిటోగాని ఆమె కంఠమాధుర్యం మాత్రమే నాకు అర్థమవుతోంది.

పాట ముగించి నవ్వుతూ "ఇంక చాలా" అని అడిగింది. ఆ క్షణంలో అనిపించింది ప్రపంచంలో స్థిరంగా ఒక్క ఆషా నవ్వు మాత్రమే నిలిచిపోతే బాగుండునని.

అసలు నిన్న భువనోపాధ్యాయని కలుసుకొన్నప్పటి నుండీ మనసు కుతకుతలాడి పోతోంది. ఈరోజు ఆఫీసుకు కూడ సెలవు పెట్టాను. ఈ దేవత దర్శనంతో నైనా మనసు చల్లబరచుకోవాలని ఇలా వచ్చాను.

"ఏమిటి శేఖర్, కాస్త విచారంగా కనిపిస్తున్నావు?"

"దానికి దూరంగా ఉండాలనే నీ దగ్గరకు వచ్చాను ఆషా. కొందరిని కలుసుకొంటే వారు విషవాయువులు చిమ్ముతున్నారనిపిస్తుంది. మనకెన్నో విధాల బాధలు కలిగించి హింసిస్తారు. మరికొందరి సాన్నిధ్యం వెన్నెలలా చల్లగా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇంత విభిన్న ప్రకృతుల మధ్య నాబోటివారు నలిగిపోతూ సేదదీర్చుకొంటూ ఉంటారు."

"ఏమిటి బాబూ భావ కవిత్వం చెబుతున్నావు. ఇంతకూ నేను విషవాయువునా? వెన్నెల ధారనా?"

గల గల నవ్వింది. నేనూ నవ్వేశాను.

"నీలిమ కులాసాగా ఉందా?"

"ఊ. డ్యూటీలో చేరింది. పైకి కనిపించదు కాని బాగా బాధపడుతూ ఉంటుంది. ఇటువంటి సమస్యలు ఒకరు తీర్చగలిగేవా?"

ఆషా ఒక్కక్షణం మౌనంగా ఉండి "అవును పాపం" అంది పరధ్యానంగా.

"నేను చేయగలిగిన ప్రయత్నాలు చేస్తున్నాను తనను మామూలు మనిషిగా చేయటానికి."

"ఏమిటా ప్రయత్నాలు?"

"మా ఆఫీసులో రవీందర్ అని ఒకతను ఉన్నాడు. ఛీఫ్ సబ్. త్వరలోనే న్యూసెడిటర్ కాగలడు."

"అయితే ..."

"అతను చాలా మంచివాడు. స్నేహ హృదయుడు. అతనికి ముసలి తల్లితప్ప ఇంకెవరూ లేరు. అతనికీ నీలిమకు బాగా స్నేహం పెంపొందించాలను కొంటున్నాను."

"ఓహో, పెళ్ళి పెద్దవవుతున్నావా?"

"కాదు ఆషా. రవీందర్‌కు మొదటి నుండి నీలిమంటే చెప్పలేని అభిమానం, గౌరవమూను. చక్రవర్తి ఆమెకు చేసిన మోసం కూడా ఇతనికి తెలుసు."

"మరి నీలిమకు కూడ ఇతనిమీద ప్రేమ కలగాలిగా."

"అంతమంచివాడు కాస్త దగ్గరయితే ఎవరయినా ప్రేమించగలరు. నీలిమ ఎంత స్వేచ్ఛగా ఆలోచిస్తుందో అతనూ అలాగే ఆలోచిస్తాడు."

"ఆల్‌రైట్ ఆల్‌రైట్. విష్ యు సక్సెస్. మరి నీ సబిత ఏమంటోంది?"

"నా సబితా?"

"అవును. సబితంటే నీకు అభిమానం లేదూ?"

"ఆషా. నా గురించి చెప్పుకోకూడదు గాని నేను నా చుట్టూ ఉన్న వాళ్ళని ప్రేమించనిదెప్పుడు? సబితంటే నాకు ప్రత్యేకమైన అభిమానం ఉన్నమాట నిజమే. తను హృదయం విప్పి తన సమస్యలన్నీ నాతో చర్చించింది."

"ఆ అమ్మాయి కేమి సమస్యలున్నాయి?"

"పైకి చెబితే ఓస్ ఇంతేనా అనేస్తావు. కాని సబిత హృదయం బాగా నలిగిపోతోంది."

"బాగుంది. అందరూ తమ కష్టసుఖాలు నీతో చెప్పుకుంటున్నారన్నమాట."

"నేనూ నా కష్టసుఖాలు నీతో చెప్పుకొంటున్నాను. మరి నీ మాటేమిటి?"

నవ్వేసింది.

"నాకు కష్టాలేమిటోయ్" అంది.

"ఎక్కడికైనా అందమైన ప్రదేశానికి వెళ్లి ప్రశాంతంగా కొన్నాళ్లు గడపాలని ఉంది ఆషా."

"కాశ్మీరుకు వెళ్దామా?"

"కాశ్మీరా'నా ఊహా సుందరి కాశ్మీరా" అని ఆశ్చర్యపోయాను.

"ఊఁ. శ్రీనగర్‌లో కొన్నాళ్లు ఉండి వద్దాం. అక్కడ సరస్సులు, పూల తోటలు, బోట్ హౌసులు, మంచు కొండలు ఈ పార్థివ ప్రపంచాన్ని మరిపింపజేస్తాయి."

"నిజంగా అంటున్నావా ఆషా."

"కాకపోతే అబద్ధమా? ఛటర్జీ కుటుంబం, కూతుళ్ళూ, అల్లుళ్ళూ కలిసి వెళ్ళాలనుకొంటున్నారు. మనమూ వెళ్తేసరి. కంపెనీ వుంటుంది. ఛటర్జీ తెలీదూ? రిటైర్డ్ జడ్జి. ప్రక్క వీధిలో గులాబిరంగు బంగళా వారిదే."

నేనేం మాట్లాడలేదు. కాశ్మీరుయాత్ర అంటే సామాన్యమా? డబ్బుతో పని. అదీ టూరిస్టుల సీజను. నా సేవింగ్సు ఏ మూలకు?

"ఏమంటావు శేఖర్?"

"ఇప్పుడు కుదరదులే ఆషా."

"ఎందుకు కుదరదు?"

"సెలవు దొరకదేమో!"

"ఈ కబుర్లు నాతో చెప్పకు. మీ ఎడిటరు గారికి మానసపుత్రుడివి. అడగాలేకాని ఆయన వద్దంటారా?"

"అసలు నా దగ్గర కావలసినంత డబ్బు లేదు ఆషా."

ఒక నిముషం నాకేసి చూసి నవ్వేస్తూ "పిచ్చీ" అంటూ నాముక్కు పట్టుకు ఊపింది. "మనమింత ఆత్మీయులమైనా నా డబ్బు నీకు పనికిరాదా?"

"ఆత్మీయత పేరుతో నిన్ను ఇబ్బంది పెట్టలేను."

"నాకేం ఇబ్బంది లేదోయ్ మహానుభావా. నేను నా జీతం డబ్బులమీదే బ్రతకటం లేదనీ, చాలా ఆస్తిపరురాలినని నీదాకా కబురు చేరకపోవటం ఆశ్చర్యంగానే ఉంది."

మొత్తానికి ఆషా నన్ను ఒప్పించింది. ముఖర్జీ నన్ను పంపటానికి ఒప్పుకొన్నారు "పరీక్షలకు చదివి అలసిపోయావేమో సరదాగా తిరిగిరా పాపం" అన్నారు.

★ ★ ★

జమ్మునుండి శ్రీనగరు ప్రయాణం చెప్పుకోదగినది. ప్రకృతి మాత పచ్చగా ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. లోతైన లోయలు,చిత్రకారుడి రంగుల కలయికలా ఎన్నో రంగులు. సెలయేళ్ళు చిన్న చిన్న జలపాతాలు గల, గల పారుతున్నాయి. సంధ్యకాంతులు మేఘాలకు బంగారు జలతారుగా మారాయి.

ప్రయాణం సుదీర్ఘమయినా ప్రకృతి అందాలతో కైపెక్కిన మాకు బాధలూ తెలియలేదు. మేము శ్రీనగరులోని దాల్‌లేక్ చేరేసరికి చీకటిపడింది. బెంగాలు ఎండలకు, ఇక్కడి చలికి ఏమాత్రం పోలిక కనిపించలేదు. ఇది ఇంకా చలికాలం కూడ కాదు. స్వెటరు వేసుకుని మఫ్లరు చుట్టుకొన్నా నా చేతులు చల్లగా మంచులా తగులుతున్నాయి.

దాల్ సరస్సులో నీళ్ళు నిశ్చలంగా ఉన్నాయి. బోట్‌హౌసులలో వెలుగుతున్న లైట్లు నీళ్ళలో ప్రతిఫలిస్తున్నాయి. బోటు హౌసులన్నీ ప్రయాణానికి సిద్ధమైన ఓడల్లా ఉన్నాయి.

మమ్మల్ని చూడగానే పడవలవాళ్ళు వచ్చారు. ఆ పడవలని "షికారా" లంటారు అక్కడ. షికారా ముందుకు సాగుతుంటే నాగుండెలో అనిర్వచనీయమైన అనందం అలుముకొంది. ఆ సరసుకన్నా ప్రశాంతంగా, నిండుగా వుండిపోయింది. నామనసు.

"గ్రీన్‌లాండ్" అనే బోటు హౌస్ మేము అద్దెకు తీసుకున్నాము. ఇంకోగంటలో భోజనం తయారవుతుందని చెప్పారు హౌస్‌కీపరు. మాసామాన్లు గదుల్లో సర్దేశారు. నాది ఒక చిన్నగది. వెచ్చగా హాయిగా ఉంది. నా ప్రక్కనున్న గది ఆషాది. ఎదురుగా ఉన్న మూడు గదులు ఛటర్జీకుటుంబం ఆక్రమించుకొంది.

అంతా కొత్తగా, వింతగా ఉంది. భోజనం తయారయ్యేలోపుగా ఇల్లంతా ఒకసారి చుట్టివచ్చాను. మేమున్న గదులు గాక మధ్యలో ఒక పెద్ద హాలుంది. అది డ్రాయింగు రూములా ఉంది. పెద్దపెద్ద సోఫాలు, రాక్‌లో పుస్తకాలు, పక్కన రేడియో... అచ్చం ఇంట్లో ఉన్నట్టే ఉంది. హాలు తర్వాత వరండా, వరండా మెట్లు సరస్సులోకి ఉన్నాయి. మా బోటు హౌసును, ఇంకో బోటుహౌసును కలుపుతూ చెక్కవంతెన ఉంది. రెండిండ్ల మధ్య ఖాళీస్థలం. ఆ వెనక డైనింగ్ హాలు. ఖాళీ స్థలంలో రెండువైపులా వరుసగా పూల మొక్కలున్నాయి. మధ్యలో సన్‌షేడు, బెంచీలు, కుర్చీలు ఉన్నాయి.

రాత్రి ఎనిమిది దాటింది. చలి గడగడలాడిస్తోంది. బహుశా సరస్సు మూలంగానేమో! "హలో" అని వినిపించింది. వెనక్కి చూశాను. ఆషానవ్వుతూ నిలుచుంది. ప్రయాణంలో చెదిరిన ముంగురులు ఆలాగే ఉన్నాయి. కళ్ళు కాస్త అలసటగా కనిపిస్తున్నాయి. మొహం స్వచ్ఛంగా మెరుస్తోంది. ఓవర్‌కోటు వేసుకుంది. ఆ కోటు రంగులోనే సిల్కుస్కార్ఫ్ తలకు చుట్టుకొంది. ఈ చక్కటి వాతావరణంలో అతి సహజంగా అమరిపోయింది ఆషా. ఇదేమి అందం! భగవంతుడు ఈమెకు ఇంతటి వరం ఎలా ఇచ్చాడు అని అబ్బుర పడ్డాను.

"ఏమిటోయ్ శేఖర్. చలిగా లేదూ? భావుకతలో పడిపోయావేమిటి? కాస్త మొహం కడుక్కుని బట్టలు మార్చుకోవాలేమో చూడు. భోజనం తయారుగా ఉంది. అందరికీ ఆకలి దంచేస్తుంది."

నెమ్మదిగా లోపలికి కదిలాను.అదేదో స్వప్నలోకంలో ఉన్నట్టుంది నామటుకు బోటుహౌస్‌లో ఎంత నెమ్మదిగా కదిలినా చెక్కల మూలంగా బాగా శబ్దం వస్తుంది. కాస్త బరువుగా అడుగులు వేసే ఛటర్జీ నడిచారంటే ఇక మనగుండెలు దడదడలాడవలసిందే.

మోహం కడుక్కొందామని కొళాయి తిప్పాను వెంటనే చేతులు వెనక్కిలాక్కున్నాను. అవినీళ్ళా లేక మంచు ప్రవాహమా? ఆ చల్ల దనానికి చేతులు చిత్రంగా నొప్పి పెట్టున్నాయి. వేడినీళ్ళ ట్యాప్ త్రిప్పి మొహంకడుక్కున్నాను. చాలా ఉల్లాసంగా ఉంది. బట్టలు మార్చుకొని ఉలెన్ హౌస్‌కోటు వేసుకొని డైనింగ్ హాలువైపు నడిచాను.

అవిర్లుగ్రక్కే అన్నము, నాలుగు రకాలకూరలు అన్నీ సిద్ధంగాఉన్నాయి. ఎవరికి కావలసినది వాళ్ళు తింటున్నారు. ప్రక్కనిసర్వర్లు కళ్ళెత్తి చూడటం ఆలస్యంగా అన్నీ అమరుస్తున్నారు. ఆ అన్నం, వేడివేడి పప్పు కలుపుకొని నోట్లోపెట్టుకుంటే బలేగా ఉంది. "అన్నం తినటంలో ఇంతసుఖముందా? " అని మొదటిసారిగా విస్తుపోయాను.

ప్రయాణం అలసట, కడుపునిండా భోజనం అవగానే నిద్రముంచు కొచ్చింది. రజాయిలో దూరటం ఆలస్యంగా నిద్ర పట్టేసింది.

"టక్, టక్" మన్న చప్పుడుకు కళ్ళు తెరిచాను. అంతాచీకటి, చుట్టూ వెచ్చదనం. మొహంమీద నుంచి రజాయి తొలిగించాను. గదంతా మసకవెలుగు.తలుపు దగ్గర మరలా "టక్‌టక్" మనిశబ్దం వినిపించింది. నేనెక్కడున్నానో తెలిసేసరికి ఒక నిముషం పట్టింది. "బెడ్‌టీ" అంటూ బేరర్ ట్రేతో ప్రత్యక్షమయ్యాడు.

టీ చప్పరిస్తూ కిటికీ తెర తొలగించాను. బయట ఇంకామంచు తెర తొలగలేదు. సరసులో ఈదుతున్న తెల్లటి బాతులు కనిపించాయి. ఇన్నేళ్ళలో నిద్ర లేచి ఇంత సుందర దృశ్యం చూడటం ఇదే మొదటిసారి.

గదివదలి ఇవతలికి వచ్చాను. పూలమొక్కలు రంగురంగుల పూలతో నవ్వుతున్నాయి. పచ్చికమీద, మొక్కల మీద మంచు బిందువులు తళతళలాడుతున్నాయి. అప్పుడే సూర్యుడు కొండల మధ్య తొంగి చూస్తున్నాడు. మెరిసే నీళ్ళపై అప్పుడే షికారాలు తిరగటం ప్రారంభించాయి.

గులాబిబుగ్గల కాశ్మీరు వనితలను, వారి విచిత్ర వేషధారణను చూస్తూ నీటికి దగ్గరగా

నిల్చున్నాను. పండ్లతో నిండిన షికారా నావైపు వచ్చింది. కాశ్మీరు వనిత మనోహరంగా నవ్వుతూ పళ్ళు కొనమని ఉర్దూలో అడిగింది. బుట్టడు యాపిల్స్ కొని లోపలికి తీసుకెళ్ళాను.

బ్రేక్‌ఫాస్టు పూర్తయ్యాక వూరు చూడటానికి బయలుదేరాము. ఆ రోజంతా ముఖ్యమైన పూలతోటలన్నీ చూశాము. చలిచలిగా, ఎండ వెచ్చవెచ్చగా, వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. ఆ తోటల పేర్లు కూడా బాగున్నాయి. పచ్చగా పచ్చిక, రంగురంగుల పువ్వులు... రకరకాల మనుషులు... నీళ్ళ ఫౌంటెన్‌ల మధ్య, పూలమొక్కల మధ్య ఫోటోలు తీసుకుంటున్నారు. ఆ పువ్వుల్లో పువ్వుగా, ప్రకృతిలో ఒక భాగంగా ఆషా మెరిసిపోతోంది. కెమేరా అవసరం మొదటిసారిగా తెలుసుకొన్నాను.

ఛటర్జీ కూతుళ్ళు, అల్లుళ్ళు సరదాగా చేతులు పట్టుకు తిరిగేస్తున్నారు. పెద్దాయన, పెద్దావిడ మాత్రం పదిగజాలకు ఒకసారి కూర్చుంటున్నారు. ఇన్‌ఫర్‌మేషన్ సెంటరులో కొన్ని పుస్తకాలు, ఫోటోలు కొన్నాము. అప్పటికే బాగా చీకటి పడింది. చలికి గజగజలాడుతూ, అకలికి నకనకలాడుతూ బోటు హౌస్ చేరుకున్నాం.

★ ★ ★

శ్రీనగరు వచ్చినప్పటి నుండి ఆషాలో అదో విధమైన గంభీరత అలముకొంది. అన్ని అందాలూ, సరదాలూ అలా మౌనంగా చూస్తూ కూర్చుండిపోయిందిగాని ఎక్కువ యాక్టివ్ పార్టు తీసుకోలేదు.

రెండో రోజంతా షాపింగులో గడిచిపోయింది. రకరకాల కర్రసామానులు, తివాసీలు, ఉన్ని శాలువలూ కొన్నారందరూ. నేను 'పేపర్ మెష్'తో చేసిన రెండు మూడు వస్తువులూ, కర్రతో చేసిన షికారా బొమ్మా, డిజైన్లు కుట్టిన ఉన్ని ఆసనం కొన్నాను. ఆషా నా కోసం ఉన్ని శాలువా ఎన్నిక చేసింది.

ఆ రాత్రి భోజనాలకు ముందు ఛటర్జీ నన్ను తన గదికి ఆహ్వానించారు. ఆయన అల్లుళ్ళు కూడ ఆ గదిలో ఉన్నారు.

"కమిన్. కాశ్మీరు అందం అనుభవించటానికి మీకొక చక్కటి మార్గం చూపిస్తాను." వ్యవహారం అర్థమయింది. ఒక్కక్షణం మనస్సాక్షి గొడవచేసింది. కాని క్రొత్త రుచులు, క్రొత్త అనుభవాలు అంటే కుతూహలం సహజమే. ఆయన గ్లాసులోకి వొంపి సోడా నింపగానే

మాట్లాడకుండా తీసుకొన్నాను. "ఫర్ యువర్ హెల్త్" అని ఆయన గ్లాసుకు నా గ్లాసు తాకించి త్రాగటం మొదలు బెట్టాను. వగరుగా, చేదుగా ఏమిటో తెలియనితనం ... కాస్త ఎక్కువే అయినట్లుంది.

భోజన సమయంలో సుష్టుగా భోంచేశాను. అప్పుడు మాత్రం కంట్రోలులోనే ఉన్నాను. బోజనమయినప్పటి నుండి నా నోరు నా స్వాధీనంలో లేదు. ఏమేమి మాట్లాడుతున్నానో నాకే అర్థం కాలేదు. జలపాతంలా మాటలు జారిపోతున్నాయి. ఛటర్జీ, ఆయన అల్లుళ్ళూ కులాసాగా కబుర్లు చెబుతున్నారు. జోక్సు వేస్తున్నారు.

పడుకోటానికి అందరమూ మా మా గదుల్లోకి వెళ్ళిపోయాము. బాగా మత్తుగా, నిద్రగా ఉంది. కాళ్లు తడబడుతున్నాయి. ఎలాగో రజాయిలోకి దూరాను. ఇంతలోనే నా గదిలో లైటు వేశారెవరో. రజాయి తొలగిస్తూ "ఎవరూ" అన్నాను సగం మూసుకొన్న కళ్ళతో. నా కళ్ళు విప్పారాయి. ఆషా! నీలి రంగు స్వెటరు, అదే రంగు స్కార్ఫు... అది కొద్దిగా జారి మెడకు చుట్టుకొని ఉంది. ఆ అందాల రాశిని ఆపళంగా అక్కున చేర్చుకోవాలని పించింది.

"కమిన్ డియర్" అంటూ నవ్వుతూ లేచాను.

ఆషా తన ఎర్రటి పెదవిని పంటితో నొక్కుకొంది. ఆ విశాలమైన నల్లటి కళ్ళు తళ తళా మెరుస్తున్నాయి. దగ్గరగా వెళ్ళాను. చెదిరిన ముంగురులతో పాలరాతి శిల్పంలా, కాదు గులాబీ పువ్వులా ఉన్న ఆషా నా కళ్ళను చెదరగొట్తోంది. మరో క్షణంలో ఆమె తలను నా వక్షానికి అదుముకొన్నాను. తన మెత్తటి జుట్టును వేళ్ళతో సవరించసాగాను.

"వదులు. వదులు శేఖర్" అని తలను విదుల్చుకొని మొహమెత్తి చూసింది.

ఆ ఎర్రటి పెదవులు తడితో మెరుస్తున్నాయి. వాటిని నా పెదవులతో అందుకోబోయాను... అంతే ... నా చెంపలు ఫెడీ ఫెడీ మన్నాయి. నా పట్టు తప్పింది. మంచం మీదపడ్డాను. "డ్రంకర్డ్... యూ టూ... శేఖర్" అంటూ వెళ్లిపోయింది.

నా మత్తు కాస్త దిగిపోయింది. చెంపలు చురుక్కుమంటున్నాయి. ఏం పని చేశాను? ఆషా దేవతను అపవిత్రం చేయబొయ్యాను. ఇక తనకు నా మొహమెలా చూపించాలి? ఘోష్‌కూ, నాకూ తేడా ఏమిటి? అందరిదీ ఒకే ప్రవృత్తి. తప్పితే డిగ్రీల తేడా ఉంటుంది. అంత బాధలోనూ, నిషా మూలంగా చప్పున నిద్రపట్టింది.

★ ★ ★

ఉదయాన 'బెడ్ టీ' వచ్చింది. వద్దు తీసుకెళ్ళమన్నాను. ఓ గంట ఆగి ఫలహారానికి పిలుపు వచ్చింది. వెళ్ళలేదు. మొహమైనా కడుక్కోకుండా అలాగే పక్కమీద పడుకున్నాను బయటకు వెళ్తే ఆషా కనిపిస్తుందేమో! ఈ క్షణంలో చచ్చిపోయినా బాగుండుననిపించింది. ఆషా ఆదరణ, మమత అన్నీ పొంది నేను చేసిందేమిటి? ... నన్నెంత నీచునిగా భావించి ఉంటుంది! తను అనుకోవటమేం? నాకు మాత్రం తెలీదూ నేనెంత నీచుడినో!

ఇంకో గంట గడిచింది. అందరూ వెళ్ళినట్టున్నారు. బోట్ హౌస్‌లో ఎక్కడా అలికిడి వినిపించలేదు. ఇంతలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఇప్పుడే నేను శ్రీనగరు వదిలి వెళ్ళిపోతే ఎంత బాగుంటుంది? ఆషాను కలుసుకొనే బాధ తప్పుతుంది. ఏదో అర్జంటు పని ఉందని ఒక చీటీ వ్రాసి పెట్తే సరి. కలకత్తాకు వెళ్ళిన తర్వాత మిగతా విషయాలు చూసుకోవచ్చు.

లేద్దామనుకొంటూ ఉండగా గది తలుపు తెరుచుకొంది. గులాబి రంగు చీర కనిపించింది. చప్పున కళ్ళు మూసేసుకొన్నాను. తను నా దగ్గరగా వంగి చూస్తున్న అనుభూతి. చెప్పుల చప్పుడు కొంచెం దూరమయింది. మెల్లగా కళ్ళు విప్పాను. కిటికీ దగ్గర నిల్చుని నాకేసే చూస్తున్న ఆషా చూపులకు చిక్కిపోయాను. ఎలా పలుకరించాలో తెలియలేదు.

"గుడ్ మార్నింగ్. నిద్ర పూర్తయిందా?" మాట సౌమ్యంగానే ఉంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"పెహల్‌గావ్ వెళ్ళలేదా?"

"ఉహూ. నీకేం కష్టంగా ఉందా? ఇంకా పవళించే ఉన్నావెందుకు?" ఏమీ జరగనట్లే కుర్చీ దగ్గరగా లాక్కుని కూర్చుంది.

"ఒంట్లో నలతగా ఉంది."

"అబద్ధాలు చెప్పకు. లేచి మొహం కడుక్కో. బుగ్గలు బాగా వాచినట్లున్నాయే" అంది నా చెంపలకేసి చూస్తూ.

సిగ్గుతో చితికిపోయాను. మొహం కడుక్కొనే నెపంతో బాత్‌రూంలోకి వెళ్ళాను. బ్రేక్‌ఫాస్టుకు చాలా ఆలస్యమయింది కనుక దొరకదు, ఏదో ఏర్పాటు చేస్తాను గాని నా గదికి రమ్మని చెప్పి వెళ్ళిపోయింది ఆషా. తప్పేదేముంది? వెళ్ళాను.

యాపిల్ ముక్కలు, ఫ్రూట్ కేకు ప్లేట్లలో అమర్చిపెట్టింది. కదులుతున్న బాతులకేసి చూస్తూ కిటికీ దగ్గరే నిలుచున్నాను.

"శేఖర్, మరీ అంత గంభీరత పనికి రాదోయ్. కాస్త మామూలుగా ఉందూ" అంది తను చిరునవ్వుతో. కళ్ళువాల్చుకుని "నన్ను క్షమించు ఆషా" అన్నాను.

"నీ తప్పేముందిలే శేఖర్. ఒంటరిగా ఉన్న ఆడదంటే ఎవరికయినా లోకువే. కలిసి మెలిసి తిరిగిందంటే ఇక చెప్పాలా?"

గుండె కలుక్కుమంది. "నిన్నెప్పుడూ లోకువగా చూడలేదు ఆషా. ఐ అడోర్ యూ. నీ అసమాన సౌందర్యం కంటే నీ ఆర్ద్రత, నీ మంచితనం నా ఆరాధనకు కారణమంటే నమ్మవూ" కళ్లెత్తి తనను చూశాను. ఆమె కళ్లు మేఘాల్లా ఉన్నాయి. కాని మొహం ప్రశాంతంగానే ఉంది.

"నిన్ను అవమానించాలని ఎన్నడూ అనుకోలేదు ఆషా. రాత్రి ... రాత్రి నేను తాగాను."

"నాకు తెలుసు. ఆ విషయమై అడగాలనే నీ గదికి వచ్చాను."

"ఛటర్జీ కంపెనీలో తీసుకొన్నాను. ఇదే మొదటిసారి ఆషా."

"శేఖర్‌బాబూ. ధర్మసూత్రాలు నీకు చెప్పాలని కాదుగాని ... నీవింకా చిన్న వాడివి. కుతూహలంకొద్దీ క్రొత్త పంథాలు తొక్కుతున్నావు. చివరికి అవి అలవాట్లుగా పరిణమిస్తే నీ జీవితం దెబ్బతింటుందేమోనని నా భయం."

నేనేమీ మాట్లాడలేదు. కిటికీలో నుండి అవతలకి చూశాను. వెచ్చటి కిరణాలలో దాల్ లేక్ పరవశిస్తోంది. ఎవరో అందమైన అమ్మాయి షికారాలో మెత్తని దిండ్లకు ఆనుకొని ఏదో పుస్తకం చదువుతోంది.

"జీవితంలో క్రొత్త అనుభవాలు బాగానే ఉంటాయి. కాని ఎక్స్‌పెరిమెంటు పేరుతో అసలు జీవితానికే ముప్పు తెచ్చుకోకూడదు." ఆషా చాలా పెద్దరికపు హోదాలో మాట్లాడుతోంది. తప్పుచేసిన బడి పిల్లాడిలా ఎదురుగా కుర్చీలో కూర్చున్నాను.

"నన్ను ఆరాధిస్తున్నానంటావు. ఈ మాట వినటం ఈ జీవితంలో ఎన్నోసారో చెప్పలేను."

"అయితే వాళ్ళందరిలో నన్నూ జమకట్టున్నావా? ప్రత్యేకంగా నేనంటే నీకు అభిమానమేదీ లేదా?" చాలా ఉద్రేకంగా అడిగాను.

"ఆ అభిమానమే లేకుంటే రాత్రి జరిగిన సంఘటన తర్వాత కూడ నిన్ను దగ్గరగా పిలిచి మాట్లాడేదాన్నా?" నిజమేననిపించింది.

"అసలు 'ప్రేమ' గురించి పదే పదే మాట్లాడి అందరూ దానిని అర్థవిహీనం చేశారు. ఈ వ్యవహారాలన్నీ చిన్న పిల్లల చేష్టలుగా సిన్సియారిటీ లేనట్లు అన్పిస్తాయి. ఎందుకో తెలుసా? నాకు పెళ్ళయింది. భర్తపోయి ఐదేండ్లయింది."

నా నెత్తిన పిడుగుపడినా అంత అచేతనుణ్ణి అయి ఉండనేమో! కుర్చీలో నా చేతులూ, కాళ్ళూ బిగుసుకు పోయాయి.

"నిజం శేఖర్! నిజం." ఆషా కంఠం దుఃఖంతో పూడుకుపోయింది. "నా వ్యక్తిగత జీవితం ఎవరికి తెలుసు? అందరూ నా అందాన్నీ, డబ్బునే చూశారు. నా చిరునవ్వు వెనుక ఎంత దుఃఖముందో ఎవరూ ఊహించలేరు." ఆమె కళ్ళనుండి నీళ్లు ధారాపాతంగా కారసాగాయి. మొదటిసారిగా ఆషా దుఃఖాన్ని చూస్తున్నాను.

"ఈ దుఃఖం భరించటం కష్టం శేఖర్! పదిమంది ఎదుట ఎలా తిరిగినా ఒంటరిగా నా జీవితం చూసుకొంటే అంతులేని శూన్యమే కనిపిస్తుంది. అందుకే సమాజమనీ, సాహిత్యమనీ, సంగీతమనీ బోలెడు వ్యాపకాలు పెట్టుకొంటున్నాను... నా చదువంతా బెంగుళూరులో ఒక కాన్వెంటులో గడిచింది. అమ్మ ఆంధ్రవనిత. నాన్నగారేమో బెంగాలీ క్రిష్టియను. ఆయన మిలిటరీ ఆఫీసరు. తరచుగా బదిలీలు, ప్రత్యేకమైన డ్యూటీలతో ఇంటికి దూరంగానే చాలావరకు గడిచిపోయింది ఆయన జీవితం. నేనప్పుడు కాలేజీలో ఫైనలియరు చదువుతున్నాను. నాన్నగారిని నాగాలాండుకు ప్రత్యేకమయిన డ్యూటీమీద పోస్టు చేశారు. నాన్నగారి నుండి వచ్చే ఒక్కొక్క ఉత్తరం ఎంత ఆసక్తిదాయకంగా ఉండేదో అంత భయాన్నీ కలిగించేది. మా అమ్మ అక్కడికి వెళ్ళాలనుకుంది. కాని కుటుంబాలు తీసుకొని రాకూడదని ప్రభుత్వం ఆర్డరిచ్చింది. నేను అమ్మా నాన్న లిద్దరికి గారాబు పట్టిని... కష్టమంటే తెలీకుండా పెరిగాను.

"జీవితమింత ఆనందదాయకమా" అనుకొనే దానిని. విచారంగా మొహం పెట్టుకొన్న వాళ్ళను, ఎప్పుడూ చిరునవ్వు నవ్వని వాళ్ళను చూస్తే నాకు జాలేసేది.

అమ్మా నాన్నలది ప్రేమ వివాహమని గ్రహించి ఉంటావు. బంధువు లెవరి తోటీ మాకు రాకపోకలు లేవు. స్నేహితులే బంధువులకంటే మిన్నగా కష్టసుఖాల్లో ఆదుకొనేవారు.

అది ఆగష్టు పన్నెండో తారీఖు. 1956వ సంవత్సరం. స్వాతంత్ర్య దినోత్సవానికి కాలేజీలో

ఏదో నాటకం రిహార్సలు ఉంది. కొంచెం ఆలస్యంగా ఇల్లు చేరాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడో ఒక లైటు డిమ్‌గా వెలుగుతోంది. అమ్మ ఏదైనా ఫంక్షనుకు వెళ్ళినా ఇల్లంత బోసిగా ఉండదు. హాల్లో బసప్ప ఎదురుపడ్డాడు. "ఏం బసప్పా. వరండాలో లైటు లేదే. అమ్మ ఇంట్లో లేకుంటే మాత్రం ఇల్లు ఇలా ఉంచాలా?" నా గదిలోకి వెళ్ళబోయాను.

"ఆషమ్మా" అన్నాడు బసప్ప. వెనక్కి తిరిగి చూశాను, అతని ముసలి కళ్ళలో నీళ్ళు.

"ఏమయింది బసప్పా? ఒంట్లో బాగలేదా?"

"కాదమ్మా. సాయంత్రం ఏదో టెలిగ్రాం వచ్చింది. అమ్మ గదిలోకి వెళ్ళి తలుపు వేసుకు కూర్చున్నారు. ఏమిటో పిలిచినా పలకటం లేదు. నాకేదో భయంగా ఉందమ్మా."

పుస్తకాలు బసప్పకు ఇచ్చి పరుగు పరుగున అమ్మ గదికి వెళ్ళాను. తలుపు తట్టినా సమాధానం లేదు.

"అమ్మా నేనమ్మా. బేబీనీ. ఒకసారి తలుపు తీయమ్మా." సమాధానం లేదు. గాజు తలుపులే కాని కర్టెన్ అడ్డొస్తున్నందున లోపల అమ్మ ఏం చేస్తూందో చూడలేక పోయాను. బసప్పను పిలిచి ప్రక్కింటి చంద్రశేఖర్‌ను పిలుచుకు రమ్మన్నాను. శేఖర్ డాక్టరుగా అప్పుడప్పుడే ప్రాక్టీసు పెట్టాడు. నా బెస్టు ఫ్రెండు కూడా.

శేఖర్ వెంటనే వచ్చాడు. అసలు విషయం చెప్పేసరికి తలుపు పగలగొట్టి వెళ్దామన్నాడు. పైనున్న గాజు సులభంగానే పగిలింది. ఐదు నిముషాల్లో తలుపులు తెరచుకొన్నాయి.

"అమ్మా" అని పరుగెత్తబోతున్న నన్ను చేతితో ఆపి "ఒక్క నిముషం. నన్ను వెళ్ళనీ" అని లోపలికి వెళ్ళాడు శేఖర్. నేనూ తనవెంటే వెళ్ళాను. అమ్మ నాడి చూసిన శేఖర్ ... అతని చూపు నాకు సర్వమూ చెప్పింది. ఆ తర్వాత ఏం జరిగిందో గుర్తులేదు.

మెలుకువ వచ్చేసరికి ఎదురుగా కుర్చీలో శేఖర్ కనిపించాడు.

"అమ్మ. అమ్మకేమయింది శేఖర్?"

"ఏం లేదులే. భయపడకు. ఏదో వార్త హఠాత్తుగా విన్నందున..."

"ఏం వార్త? దుఃఖవార్తా? ఏమిటది."

"ఇప్పుడు దేనికీ ఆందోళన పడొద్దు ఆషా. అన్నిటికీ నేనున్నానుగా."

ఓ గంట ఆలస్యమయితే మాత్రం తెలియకపోతుందా? అమ్మ ఇంకలేదు. అందుకు కారణం నాన్నగారు లేకపోవటం. విద్రోహులతో జరిగిన పోరాటంలో ఆయన పోయారు. సహగమనం గురించి పుస్తకాలలో చదివాను. జయదేవుని భార్య కాబోలు "పతి మరణ

వార్త వినికూడా జీవించిన స్త్రీ పతివ్రతా?" అని, ఆ మాట నిరూపించింది కూడా. మా అమ్మ నిండుకుండ. భూదేవి గనుకనే భర్తను అతి సహజంగా చేరుకొంది.

ఆ ఏడాది చదవలేనన్నా శేఖర్ బలవంతాన బి.ఏ. పూర్తి చేయవలసి వచ్చింది. ఆ తర్వాత శేఖర్‌తోనే వివాహమయింది. శేఖర్ "కిరస్తానీ"ని చేసుకోటం అతని పెద్దలకు గిట్టలేదు. కాని శేఖరు చాలా దృఢనిశ్చయుడు. మాదో చిన్న బంగళా. శేఖర్ ప్రాక్టీసు బాగా సాగుతోంది. నన్ను బలవంతాన యం.ఏ. లో చేర్పించాడు. రెండేండ్లు ఇట్టే నవ్వుతూ, త్రుళ్లుతూ గడిచిపోయాయి. జీవితంలో నేను పోగొట్టుకొన్న ఆదరణ, ఆప్యాయత అన్నీ శేఖర్‌వద్ద రెట్టింపుగా పొందగలిగాను. ఈ జీవితం పరిపూర్ణంగా ఉండటానికి కావలసింది ఇప్పుడో చంటిపాప. ఆ విషయమై శేఖర్ నన్నెప్పుడూ పరిహసిస్తుండేవాడు. "ఇదిగో నీ యం.ఏ. పూర్తయిందా. ఇంకొక యం.ఏ(మా) కావటానికి తయారుగా ఉండు."

"ఇంక నన్ను లక్ష్యపెట్తావా? లేక వాడి ఆలన పాలనలో గడిచిపోతుందా?" "ఈసారి నీ బర్త్‌డే గిఫ్టుకు పిల్లల పెంపకానికి సంబంధించిన పుస్తకం ఇవ్వాలనుకొంటున్నా." "వాడికి నీ కళ్ళు, నీ ముక్కు, నా జుట్టు, పెదవులు వస్తే బాగుండు." ఇలాగే ఏవేవో కల్పనలు. విసుక్కునే దానిని "ఏమీ లేనిదే ఎందుకీ హంగామా?" అని. కాని లోలోపల నా ఊహలు కూడా పరుగులు పెట్తూనే ఉన్నాయి....

ఒక రాత్రి రౌండ్సుకని ఊళ్ళో కెళ్ళిన శేఖర్ తిరిగి రాలేదు. పదిగంటల ప్రాంతంతో ఆస్పత్రి నుండి ఫోను వచ్చింది. కారు ప్రమాదంలో ఆయన గాయపడ్డారట. ఆ వార్త ఎలా తీసుకొన్నానో చెప్పలేను. రెండు రోజులు ఆయన గుండె కొట్టుకుంది కానీ ఆయన ఈ లోకంలో లేరు. మూడోరోజు నన్ను దుఃఖాలకు శాశ్వతంగా వదిలేసి వెళ్ళిపోయారు."

ఆషా ఆగింది. మళ్ళీ ఏడుపు ముంచుకొచ్చింది. కన్నీళ్లు తుడుచుకొంటూ పక్కమీదకు వాలిపోయింది. వెక్కిళ్ళతో తన శరీరం ఎగిరెగిరి పడుతోంది. తన ఉంగరాల జుట్టు మొహాన్ని కప్పేసింది. దుఃఖం ఇంత తీవ్రంగా ఉటుందా? నా దేవత గుండె కరిగించుకొని ఏడుస్తోంది. నేను మూర్ఖుడిలా కూర్చుని ఏమీ చేయలేక పోతున్నాను.

తనే తిరిగి మాట్లాడటం మొదలు పెట్టింది. "అమ్మ చాలా అదృష్టవంతురాలు, నాన్నగారు లేరనే మాటే సహించలేక పోయింది. నేను శేఖర్ చావు కళ్ళారా చూసీ ఏమీ చేయలేక పోయాను. ఎన్నో యాత్రా స్థలాలకు వెళ్ళాను. మందిరాలకు, చర్చిలకు,

గురుద్వారాలకు వెళ్లాను. బైబిలు, గీత, ఖురానులు చదివాను. మొదట వాటిపైన దృష్టి ఉండేది కాదు. బలవంతాన చదివేదాన్ని. మన ఆనందం లేక దుఃఖం మన చుట్టూ ఉన్న వాళ్ళమీద ఆధారపడకూడదని మనలోనే ఆత్మానందం కలగాలని గుర్తించాను.

మొదటినుంచీ నాన్నగారి మూలంగా బెంగాలీ సాహిత్యం, సంస్కృతులంటే ఎంతో అభిమానం ఉంటూ వచ్చింది. పాత జ్ఞాపకాలకు దూరంగా కలకత్తాకు వచ్చేశాను. ఎలాగూ నాన్నగారి ఇల్లు కలకత్తాలో ఉండనే ఉంది. నాన్నగారూ, శేఖర్ ఇద్దరూ నాకు డబ్బు కొరత లేకుండా చేశారు. వారు వెలిగించిన ప్రేమజ్యోతి నాలో అలాగే ప్రజ్వరిల్లుతోంది.

ఎన్నో వ్యాపకాల మధ్య నా దుఃఖం మరుగున పడింది? కానీ శేఖర్! ఈ నగరంలో ఎన్ని అపవాదులు, అవమానాలు భరిస్తున్నానో తెలుసా? నా ఎదుట తీయగా మాట్లాడి వెనుక ఎంతో అక్కసు వెళ్ళబోసుకొంటారు. వారి ఈర్ష్య, అసూయ, అర్థంలేని వ్యామోహం చూసి జాలిపడుతుంటాను."

చివరి కెలాగో నా గొంతులో మాట పెగిలింది. "జీవితంలో ఒకసారి దుఃఖం ప్రాప్తమయిందని జీవితమంతా దుఃఖమయం చేసుకోటం ఏమి న్యాయం?"

"వద్దు శేఖర్. ఈ ప్రలోభాలకు దూరంగా ఉండనీ. బ్రతికినన్నాళ్లు ఇక బ్రతకబోతామా? అసలే దురదృష్ట జాతకురాలిని. ఇంకా దురదృష్టం కోరి తెచ్చుకోట మెందుకూ? ఆపత్సమయమే వస్తే నీవంటి ఆత్మీయులు ఆదుకోరంటావా?"

"ఆషా" తల నిమురుతూ చెప్పాను. "ఆషా! నన్ను నీతో బ్రతకనీ. నేనూ దారీ తెన్నూ లేనివాడిని. నేనూ నీవూ కలిసి మన జీవితాలకు అర్థం కలిపించుకొందాం. నీ సంపద, నీ అందం నన్ను ప్రలోభ పెట్టున్నా యనుకోకు నిన్ను నేనెంతగా ఆరాధిస్తున్నానో గుర్తించు. నీ ఆరాధనలో జీవిస్తున్నాను. దానిలోనే నన్ను మరణించనీ. చేతులు జోడించి విన్నవించుకొంటాను. నా ప్రార్థన మన్నించు."

చర్రున లేచి కూర్చుంది ఆషా. "ఈలాంటి పిచ్చిపిచ్చి ఊహలు పెట్టుకోకబ్బాయ్. నీ పేరు మొదట నన్ను ఆకర్షించింది. ఆ తర్వాత నీ స్వభావం. కాని ఇంతమాత్రంతోనే వివాహాలు జరగవు. నాకు నిర్దిష్టమైన ఆదర్శాలున్నాయి. మంచో చెడో వాటి ప్రకారమే నేను ముందుకు నడుస్తాను. నీకంటే పెద్దదాన్ని. దుఃఖాల ఒరిపిడి చూసిన దాన్ని. నీకు సరయిన మార్గం చూపిస్తాను. ఆ దారిన పయనిద్దువు గాని."

"కానీ ఆషా.'..'

కథా నిలయం
4560
శ్రీకాకుళం

"కానీ లేదు, గీనీ లేదు. భోజనాల వేళయింది. వెళ్దాంరా" గదికి వెళ్ళి ఇద్దరమూ అన్నం తిన్న సామెత చేశాము.

★ ★ ★

ఛటర్జీ కుటుంబం వచ్చేవరకు మేమెక్కడికీ కదలలేదు. నునువెచ్చని ఎండలో కూర్చుని రంగులు మారుతున్న ఆకాశాన్ని, సరసు అందాన్ని ఆస్వాదించాం. తర్వాత మా సంభాషణ ఎప్పుడూ సెంటిమెంటల్ లెవెలులో జరగలేదు.

మధ్యాహ్నం ఒంటరిగా చాలాసేపు షికారాలో తిరిగాను. షికారా వాడితో కబుర్లేసుకొన్నాను. తన వ్యక్తిగత జీవితం గురించి, అక్కడి ప్రజల బ్రతుకుల గురించికబుర్లు చెప్పాడు. మనకంత ఆనందాన్నిచ్చే ఆ భూతల స్వర్గంలో కూడ ఆకలి కడుపులు, పేదబ్రతుకులు ఉన్నాయని తెలిసి నిట్టూర్చక చేసేదేముంది? మనం మురిసిపోయే ప్రకృతి అందాలు వాళ్ళ జీవితంలో ఒక భాగం. వాళ్ళకేదీ ప్రత్యేకంగా కనిపించదు. రకరకాల పండ్లయితే పండిస్తారు. అమ్మగా మిగిలినవే వాళ్ళు తినగలుగుతారు. చేతి పనులలో వాళ్ళెంతో నిపుణులు. గొప్ప గొప్ప శాలువలు నేస్తారు. చక్కటి కుట్టుపని చేస్తారు. కాని వాళ్ళు వేసుకొనే బట్టలు చాలా ముతగ్గా ఉంటాయి. ఈ విరోధాభాసానికే సరయిన సమాధానం దొరకదు.

ఆ రాత్రి ఛటర్జీ కుటుంబం ఎన్ని గంటలకు తిరిగి వచ్చిందో నాకు తెలీదు. మరునాడు బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటున్నప్పుడే కలిశాను. ఆయన పెహల్‌గావ్ గురించి ఒకే కబుర్లు, వర్ణనలూను. "మీరు రాలేదు గాని అక్కడ చాలా బాగుందండీ. వారం రోజులయినా అక్కడే ఉండి పోవాలనిపించింది. కానీ వారానికి సరిపడే సరంజామా తీసుకెళ్ళలేదుకదా. అందులో ఈ ఆడవాళ్ళు మరీను రోజుకు మూడు నాలుగుసార్లు బట్టలు మారుస్తారు.

అక్కడ సీనరీ చూసి తీరవలసిందే. మంచుకొండల పాదాల దగ్గరనిల్చున్నట్టే ఉంది. ఇక్కడ "షికారా" లాగా అక్కడ పోనీ రైడింగ్ అదే గుర్రపు స్వారి మీద మక్కువ అందరికీను. మా చిన్నమ్మాయి భయపడిందిగాని, పెద్దమ్మాయి బలే చలాకీగా సవారీ చేసింది. నా మటుకు నాకూ గుర్రపు స్వారీ చేయాలనిపించింది గాని కీళ్ళనొప్పులకన్నా మా ఆవిడ అదుపాజ్ఞలు ఎక్కువ. ఇక నా కోరిక తీరేదెక్కడ? డ్రింక్సు మంచివి దొరికాయి. ఓల్డ్‌స్టాక్ అన్నాడు. ఈ రాత్రికీ మళ్ళీ... ఏం సరేనా" అంటూ గూఢార్థంతో నవ్వారాయన. "క్షమించాలి. నాకు ఒంట్లో ఇంకా బాగ లేదు."

ఆయన మళ్ళీ నవ్వారు. "మొదట్లో అలాగే ఉంటుంది. ఈ చలికి, ఆ

వెప్పుదనానికి... ప్చ్... జీవితం అనుభవించాలి శేఖర్ బాబూ. నా తలపండిందంటే వూరికే అనుకున్నారా?"

నేనుచిరునవ్వుతో వూరుకొన్నాను.

★ ★ ★

కలకత్తా వచ్చాక ఓ రోజు సాయంత్రం ఆషా నా పెళ్ళి ప్రసక్తి తెచ్చింది.

"ఏం పెళ్లి లేద్దూ" అన్నాను.

"ఏం ఇలాగే ఉండిపోతావా? పెళ్ళంటే కేవలం నీకు అన్నం, వంట చేసిపెట్టి, ఇల్లు చక్కబెట్టే మనిషిని తెచ్చుకోటమే కాదని నీకు తెలిసే ఉండాలి. ఒక తోడు, ఒక నీడ .... అమితంగా ప్రేమించి, ప్రేమించబడటంలో ఎంత ఆనందం ఉందో తెలియజెప్పేది పెళ్లి, జీవితానికి సార్థకత తెచ్చేది పెళ్ళి. నీ కోసం ఆరాటపడే గుండె ఒకటి ఉండాలా? తినటం, బ్రతకటం, ఆ తిండికోసం ఆరాటం, అందులో దర్పం అదే జీవితమనుకొంటే ఎలా? ఒంటరి జీవితమెంత దుర్భరం! ఈ ప్రపంచాన్ని వదిలేసి హిమాలయాల్లో ముక్కు మూసుకొని కూర్చోవాలనుకొంటే అదివేరు. కానీ సమాజం మధ్య ఉంటూ ఒంటికంటి రాక్షసుడిలా బ్రతకటం హాస్యాస్పదం ... న్యూనత కూడాను"

"అవన్నీ నిజమేనని ఒప్పుకొంటాను ఆషా. మరి నీ జీవిత మేమిటి?"

"నా జీవితంతో నీ జీవితం పోల్చకు. వికసించక ముందే వాడిపోయిన జీవితం నాది. ఇంకా వికసించని జీవితం నీది."

"నేను కోరిన వ్యక్తి, ఆరాధించిన వ్యక్తి దుఃఖం అనుభవిస్తుంటే నాకు సుఖ మెక్కడిది ఆషా?"

"నీది ఎదగని మనసు శేఖర్ బాబూ, నా ప్రసక్తి వదిలిపెట్టు. నీ శ్రేయోభిలాషిగా నేనిచ్చే సలహా నీకు నచ్చితే వివాహం చేసుకొని నీ జీవితం చక్కదిద్దుకో."

"మరి... మరి.... నా జీవితం అప్పుడు వేరయిపోదూ, నీ దగ్గర నాకు స్థానమేదీ?"

"మమతలకూ, అనురాగాలకూ అడ్డేమిటి శేఖర్. నీ స్థానం ఇప్పటిలా ఎప్పటికీ పదిలంగా ఉంటుంది."

మౌనంగా ఉండిపోయాను.

"ఐ బ్లెస్ యూ" ఆమె ఎర్రటి పెదవులు నా నుదుటిని తాకాయి.

★ ★ ★

సబిత నుండి ఉత్తరం వచ్చింది. తనకు నేనిచ్చిన సహాయ సహకారాలకు కృతజ్ఞత తెలిపింది. తన ఆలోచనలు ఒక దారిని పడ్డాయట. వాళ్ళ సహాధ్యాయి అయిన ఒక ముస్లిం యువకుడిని పెళ్ళి చేసుకోవాలను కొంటోందట. "యూసఫ్ నాకు మూడేండ్లుగా తెలుసు. చిత్రకళలో చాలా అందెవేసిన చేయి. అతని చిత్రాలలో రంగుల కలయిక ప్రత్యేకంగా నన్ను ఆకర్షిస్తుంది. అతను చాలా పైకి వస్తాడని నా ఆశ. నాన్నగారికి ఈ విషయమై నిరాశ కలగవచ్చు. కానీ మీరే ఆయనకు నచ్చజెప్పాలి...."

ముఖర్జీ ఆఫీసుకే రాలేదు. ఇంటికి వెళ్ళాను. పడక కుర్చీలో దిగాలుగా కూర్చున్నారు. సబిత తల్లి కూడా వంట ప్రయత్నాలు ఏమీ చేయలేదు. లోపల పడుకొని కుమిలి కుమిలి ఏడుస్తోంది.

"సబిత ఎంతపని చేసిందో తెలుసా" అన్నారు ముఖర్జీ.

"నాకూ ఉత్తరం వ్రాసింది. ఇటీజ్ ఆల్‌రైట్. అమ్మాయికి నచ్చింది. మీరూ సరేననండి."

"ఎలా అనమంటావు శేఖర్. నాకు కులాల పట్టింపు అంత లేదుగాని ఒక్కసారిగా హిందూమతం విడిచి పెట్టడమంటే నేనొప్పుకోను. మనకేం తక్కువయిందని. పోనీ ఆ కుర్రాడా కేవలం చిత్రకారుడు. చిత్రకారుడిగా జీవితం వెళ్ళబుచ్చాలంటే ఎలా కుదురుతుంది? చెప్పుకోదగ్గ ఆస్తిపాస్తులూ లేవట. స్కాలర్‌షిప్పు మీద చదువుతున్నాడట. తగుదునమ్మా అని ఈ దుడుకుపిల్ల ఎలా నిర్ణయం చేసుకొంది? ఈ పాటికి పెళ్ళయ్యే ఉంటుంది. నేనింక దాని బ్రతుకు ఎలా బాగుచెయ్యగలను?" అంటూ కళ్ళు తుడుచుకున్నారాయన.

"సబిత భావాలు చూస్తే అసలు జీవితంలో తను అడ్జస్టు కాలేదేమో అనుకొన్నాను. ఇంత మాత్రమయినా తన బుద్ధి మారినందుకు మనం సంతోషించాలి", అన్నాను.

తర్వాత ఆయనకు సబితకూ నాకూ మధ్య జరిగిన సంభాషణలు, వాదవివాదాల గురించి చెప్పాను. ఆయన అంతావిని నిట్టూర్చారు.

"నిన్ను ఎంతో ఇదిగా చూసుకొన్నాను. నీవూ నా ఇంట్లో ఒక వ్యక్తివయితే ఎంతో బాగుండేది."

"ఇప్పుడు మాత్రం ఏం తక్కువ? మీలో నేను ఒకడిని కాదని మీరనగలరా? మీరు వెళ్ళి సబితను, యూసఫ్‌నూ తీసుకొని రండి. మీకు వీలుకాకపోతే నేనే వెళ్తాను."

"నేను ఉత్తరం వ్రాస్తాను శేఖర్, పరీక్షలయ్యాక ఇక్కడికే రమ్మని. పెళ్ళి నేనే జరిపిస్తాను. రిజిస్టరు మేరేజి అయితే సరేసరి, లేకపోతే నా బిడ్డకు నిఖా ... కట్టమంటాను." ఆయన తిరిగి కళ్లు తుడుచుకొన్నారు.

★ ★ ★

సుమారు నెల గడిచింది. నా జీవితంలో ఏ మార్పూ చేర్పూలేదు. ముఖర్జీ ఒకసారి నాకు ఒక ఉద్యోగం గురించి చెప్పారు.

"అది చాలా పెద్ద సంస్థ శేఖర్. ఆ దినపత్రికతో పాటు ఒక వార పత్రిక, పక్ష పత్రిక కూడ వాళ్లు నడుపుతున్నారని నీకు తెలుసు. వాళ్ళ ఢిల్లీ ఎడిషనులో అసిస్టెంటు ఎడిటరుగా ఎవరైనా కావాలని వాళ్ళ ఛీఫ్ ఎడిటరు ఆ మధ్య మాటల సందర్భంలో అన్నారు. నేను నీ పేరు రికమెండు చేశాను. నీకు జర్నలిజం డిప్లొమా కూడా వచ్చింది. ఢిల్లీలో ఉంటే ఇంకా వృద్ధిలోకి వస్తావు. జీతమూ పెద్దదే. ఏమంటావు?"

"నేనిక్కడ ఉండటం మీకు కష్టంగా ఉందా?"

"అదేం మాట. నా కన్నకొడుకులా కష్టసుఖాల్లో ఆదుకొన్నావు? నా ఒంటరితనం దూరం చేశావు. నిన్ను వదులుకోడమెంత కష్టమో నాకు తెలుసు. కాని నీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నీ పేరు ఆయనకు రికమెండు చేశాను. వెళ్తావు కదూ."

"సరే. కలకత్తాలో నాకేం మిగిలింది? ఇప్పుడు ఏ ఊరయినా ఒకటే."

"ఆయనకు ఉత్తరం వ్రాస్తాను".

ముఖర్జీ ఉత్తరం వ్రాశారు. త్వరలోనే ఆ పత్రిక యజమాని కలకత్తాకు ఏదో పనిమీద వచ్చాడు. ఇంటర్వ్యూ అయింది. సెలెక్టు అయ్యాను.

నేను ఢిల్లీకి ప్రయాణమయ్యే రోజు ముఖర్జీ మరీమరీ చెప్పారు. "కలకత్తాలో ఇది నీ ఇల్లే అనుకో. సెలవుపెట్టి అప్పుడప్పుడు వస్తూ ఉండు. నాకు తరచు ఉత్తరాలు వ్రాయి. సబితకు, ఆరతికి ఏ కష్టసుఖాలొచ్చినా నేను బ్రతికినా చచ్చినా అన్నీ నీవే చక్కబెట్టాలి."

వంగి ఆయన పాదాలకు నమస్కరించాను. వాత్సల్యంతో ఆయన కన్నులు చెమ్మగిల్లాయి. మాటలు తడబడ్డాయి.

నీలిమ, రవీందర్‌లు నేను వెళ్ళిపోతున్నానని బాధపడ్డారు. "కలకత్తాకు వచ్చినప్పుడు మా ఇంటికి రాకుండా పోయేరు. మా ఇల్లు ఇలా నిలబడటానికి అన్నివిధాలా కారకులు మీరని మేమెన్నటికీ మరచిపోలేం."

ఆషా నన్ను ఆప్యాయంగా పలుకరించింది. “నీవు జీవితంలో స్థిరబడుతున్నావు. కలకత్తా రూపైనా తెలియకుండా వచ్చిన నువ్వు ఇక్కడ ఎందరినో అప్తులను సంపాదించావు. మమ్మల్ని తరచు వచ్చి చూస్తుంటావు కదూ. నీ స్నేహం నాకెంత ఊరట కలిగించిందో నీవు ఊహించలేవు. తెలిసో తెలియకో నీకేదైనా బాధ కలిగిస్తే క్షమించు''.

ఆమె రెండు చేతులూ నా చేతుల్లోకి తీసుకొన్నాను. నా కళ్ళు నిండుకొచ్చాయి. ఆషా కూడ కళ్ళు తుడుచుకొంది.

“ఈ జీవితాలింతే శేఖర్. ఎడతెగని ప్రయాణమే. మధ్య మధ్యలో కొన్ని మజిలీలు. రుబాయత్‌లో అన్నట్లు ఈ ప్రపంచ మొక పాంథశాల. మనం కలుస్తూ వుంటాం. విడిపోతూ ఉంటాం.”

“ఏ అవసర మొచ్చినా నన్ను గుర్తు చేసుకొంటావుగా ఆషా.”

“మొదట నీకే కబురందుతుంది. నిన్నెప్పుడూ నేను పరాయి వ్యక్తిగా భావించలేదు. నాకు తెలుసు శేఖర్. నీవెందరి కన్నీళ్ళు తుడిచావో. ప్రస్తుతం ... నీ కన్నీళ్ళు తుడిచే శక్తి మాత్రం నాకు లేదు. అటువంటి వ్యక్తి నీకు తారసపడాలని భగవంతుని మనసారా ప్రార్థిస్తున్నాను.”

స్టేషనుకు నా అప్తులందరూ వచ్చారు. వారందరి కళ్ళలో ప్రేమ, వాత్సల్యం మెరుస్తున్నాయి. ఇంతలో పెద్దగా కేకపెట్టి బండి కదిలింది.

*(జనవరి 1975)*